https://www.sreechakranews.com

# శ్రీచక్ర


SREECHAKRA TELUGU DAILY

సంపుటి 7 | సంచిక 321 | కర్నూలు | శుక్రవారం, 5 ఏప్రిల్ 2024 | పేజీలు 09 | వెల రూ. 5,00

Published from Kurnool | Vijayawada | Ananthapuramu | Kadapa | Chittoor | Nellore | Prakasham | East Godavari | West Godavari | Hyderabad



# వైసీపీ పాలనలో.. రాష్ట్ర ప్రజలు విసిగిపోయారు!



- జగన్ పాలనలో సంక్షేమం కాదు సంక్షోభమే
- పార్టీ జెండాలు వేరైనా ఆజెండా ఒక్కటే.
- రాష్ట్ర ప్రయోజనాల కోసమే మాకలయిక.
- పింఛన్ల పంపిణీపై జగన్ ది శవరాజకీయం.
- రాష్ట్రంలో మద్యనిషేధం ఎక్కడ?
- రామచంద్రపురం ప్రజాగళం సభలో చంద్రబాబు

రామచంద్రాపురం, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) : రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల పాలనలో ప్రజలు విసిగిపోయారని మే 13కోసం ప్రజలంతా ఆత్రంగా ఎదురుచూస్తున్నారని తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు అన్నారు. ఈమేరకు రామచంద్రపురం నియోజకవర్గ ద్రాక్షారామంలో ప్రజాగళం సభకు విచ్చేసిన చంద్రబాబుకు పసలపూడి బైపాస్ వద్ద నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రధాన రహదారిమీదుగా ద్రాక్షారామం చేరుకుని బోసుబొమ్మ సెంటర్ లో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కరెంటు చార్జీలు విపరీతంగా పెంచారని, నాణ్యమైన విద్యుత్ లేదని, ప్రశాంతంగా ఉండే కోనసీమలో అల్లర్లు సృష్టించారని, నేరస్తులకు జగన్ కొమ్ముకాస్తున్నారని విమర్శించారు.



7

## విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు పెండ్లిమర్రి పి ఎస్ ఎస్.ఐ సునీల్ కుమార్ రెడ్డి సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన కర్నూల్ రేంజ్ డి.ఐ.జి విజయరరావు

కర్నూలు, ఏప్రిల్ 4(శ్రీచక్ర): విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు పెండ్లిమర్రి పీ ఎస్ ఎస్.ఐ డి.సునీల్ కుమార్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ కర్నూల్ రేంజ్ డి.ఐ.జి సి.హెచ్ విజయరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను సకాలంలో స్పందించి సరైన చర్యలు తీసుకోకపోవడంతో ఎస్.ఐపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కడప జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఇచ్చిన నివేదికల ఆధారంగా కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్. విజయరావు ఎస్సైను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎవరైనా పోలీసులు విధుల పట్ల అలసత్వం వహించి, క్రమశిక్షణ ను ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్బంగా కర్నూలు రేంజ్ డిఐజి హెచ్చరించారు.

## బెంగాల్ అకృత్యాలను బిజెపి మాత్రమే నిలవరించగలదు





- కూచ్‌బెహర్‌లో ప్రధాని మోడీ

కోల్‌కతా, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :

బెంగాల్‌లో మహిళలపై జరిగే దారుణాలు భారతీయ జనతా పార్టీ మాత్రమే నిలువరించగలదని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. తప్పు చేసిన వారిని జైలుకు తరలిస్తామని తేల్చి చెప్పారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ బిజీగా ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లో గల కూచ్ బెహర్‌లో గురువారం నాడు ప్రచారం చేశారు. మమతా బెనర్జీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. సందేశ్ ఖాళి ఘటనను ప్రధాని మోదీ ఉదహరించారు. నిందితుడిని కాపాడేందుకు దీదీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నం చేసిందని విరుచుకుపడ్డారు. 'ముందుగా మమతా బెనర్జీకి కృతజ్ఞతలు. 2019లో తాను ఇదే గ్రౌండ్‌కు వచ్చాను. ఆ సమయంలో గ్రౌండ్ మధ్యలో మమతా బెనర్జీ నిర్మాణం చేపట్టారు. దీదీ చేసిన పనికి ప్రజలు కచ్చితంగా సమాధానం ఇస్తారు. ఈ రోజు అలా చేయలేదు. మిమ్మల్ని అందరిని కలిసే అవకాశం కలిగింది. ఎలాంటి అడ్డంకులు సృష్టించనందుకు బెంగాల్ ప్రభుత్వానికి ధన్యవాదాలు అని' ప్రధాని మోదీ సెటైర్లు వేశారు. 'దేశానికి 21వ శతాబ్దం కీలకమైంది. దేశం అభివృద్ధి చెందితే పశ్చిమ బెంగాల్ దానంతట అదే డెవలప్ అవుతోంది. పేదరికాన్ని పారదోలుతామని కాంగ్రెస్ పార్టీ ఏళ్ల నుంచి నినాదాలు ఇస్తుంది. గత పదేళ్లలో 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి విముక్తి కలిగించాం. చిత్తశుద్ధితో, నిజాయితీతో తమ ప్రభుత్వం పనిచేసింది. బెంగాల్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని భావించాం. రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదు. మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తే బీజేపీకి మంచి పేరు వస్తుందని మమతా బెనర్జీ భావించారు అని' ప్రధాని మోదీ మండిపడ్డారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌కే సాధ్యం



- బిఆర్ఎస్ ప్రతిపక్షంగా కూడా పనికిరాదు
- గత పాపాలకు బాధ్యత లేదన్నట్లుగా బిఆర్ఎస్ వైఖరి
- వ్యక్తిగత, రాజకీయ అవసరాలకు ట్యాపింగ్ దుర్వినియోగం
- బిఆర్ఎస్ చేసిన తప్పలను కాంగ్రెస్ చేయదు
- తెలంగాణలో 12 నుంచి 14 సీట్లు గెలవబోతున్నాం
- తుక్కుగూడ నుంచే కాంగ్రెస్ సమరశంఖం పూరిస్తాం
- డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

2

## అమేథీలో స్మృతిపై పోటీకి వాద్రా

- రంగంలోకి దింపాలని కాంగ్రెస్ యోచన
- రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రియాంక భర్త వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :



యూపిలోని అమేథీ నుంచి కేంద్రమంత్రి స్మృతి ఇరానీని ఢీకొనేందుకు కాంగ్రెస్ రంగం సిద్ధం చేసింది. ప్రియాంక భర్త వాద్రాను రంగంలోకి దింపాలని యోచిస్తోంది. కాంగ్రెస్ వారసత్వంలో ఇప్పుడు అల్లుడు కూడా దిగబోతున్నాడు. ఈ క్రమంలో రాజకీయాల్లోకి వస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రా వెల్లడించారు. తాను రాజకీయాల్లోకి రావాలని అమేథి నియోజకవర్గ ప్రజలు ఆశిస్తున్నారని తెలిపారు. అమేథి ప్రస్తుత ఎంపీ స్మృతీ ఇరానీ వల్ల నియోజకవర్గ ప్రజలు బాగా నిరాశకు గురయ్యారని చెప్పారు. అందుకే గాంధీ కుటుంబ సభ్యుడిని నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. స్మృతీ ఇరానీని ఎంపీగా గెలిపించి తప్పు చేశామనే భావన ఇప్పటికే ఈ నియోజకవర్గంలో ఉందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అమేథి నియోజకవర్గ ఎంపీగా స్మృతీ ఇరానీ.. ఈ ప్రాంత అభివృద్ధి కోసం పాటు పడలేదని.. కేవలం గాంధీ కుటుంబంపై ఆరోపణలు చేయడానికి, వారిని కించ పరచడం కోసమే ఆమె పని చేశారని రాబర్ట్ వాద్రా వివరించారు.అలాగే స్మృతీ ఇరానీని గెలిపించి తప్పు చేశామని నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారని.. అందుకే గాంధీ కుటుంబ సభ్యుడు రావాలని వారు ఆకాంక్షిస్తున్నారన్నారు. రాయబరేలి లేదా అమేథి నుంచి ఎన్నికల బరిలో దిగి.. ఆయా నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు. అలాగే వారి భద్రత కోసం పాటు పడతానని చెప్పారు. ఇప్పటికే అమేథి, రాయబరేలి, సుల్తాన్‌పూర్, జగదీష్‌పూర్ ప్రజల కోసం గాంధీ కుటుంబం చాలా పాటుపడిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.మరోవైపు రాయబరేలి లేదా అమేథి నుంచి ప్రియాంకా గాంధీ బరిలో దిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అందుకోసం ఆమె అభ్యర్థిత్వంపై పరిశీలన జరుగుతోన్నట్లు సమాచారం. ఇక అమేథి నుంచి మళ్లీ రాహుల్ గాంధీ పోటీ చేయాలని నియోజకవర్గ పార్టీ శ్రేణులు చాలా బలంగా కోరుకుంటున్నారు. అయితే గత ఎన్నికల్లో అమేథి నుంచి బీజేపీ అభ్యర్థిగా స్మృతీ ఇరానీ బరిలో దిగారు. ఆమె చేతిలో రాహుల్ గాంధీ ఓటమి పాలయ్యారు. మరోవైపు కేరళలోని వాయునాడు నుంచి కూడా రాహుల్ గాంధీ బరిలో దిగారు. దీంతో ఆయన వాయునాడు ఎంపీగా కొనసాగారు. ఇక ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్ర రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. గతంలో అంటే 2022, జులైలో నాటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, అత్త సోనియా గాంధీని నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీ ల్యాండరింగ్ కేసులో ఈడీ ప్రశ్నించింది. ఆ సమయంలో సైతం తాను రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తానని రాబర్ట్ వాద్రా ప్రకటించిన సంగతి తెలిసిందే.

## ఉల్లి ఎగుమతులపై నిషేధం.. 5 దేశాలకు అనుమతి

**న్యూఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికల ముందు ఇటీవల కేంద్రం ఉల్లి ఎగుమతులపై కీలక నిర్ణయం తీసుకుంది. ఉల్లి ఎగుమతులపై నిరవధికంగా నిషేధాన్ని పొడగించింది. వరసగా రెండేళ్లలుగా ఉల్లిపాయల పంట దిగుబడి తక్కువగా ఉంటుందనే వార్తల నేపథ్యంలో.. ప్రజలకు అందుబాటులో ఉండేలా చేసేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. గతేడాది డిసెంబర్ నెలలో ఉల్లిపై కేంద్రం ఆంక్షలు విధించింది. ఇది మార్చి 31 వరకు కొనసాగుతుందని చెప్పింది. అయితే, ఈ తేదీ రాకుముందే నిరవధికంగా నిషేధాన్ని పొడగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.ప్రపంచంలోనే అతిపెద్ద ఉల్లి ఎగుమతి చేసే దేశంగా ఉన్న భారత్, పలు దేశాల దౌత్యపరమైన అభ్యర్థన తర్వాత ఎగుమతికి అనుమతించింది.

శ్రీచక్ర



# వైసిపికి ఆమంచి రాజీనామా

- కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయం

**చీరాల, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

ఎన్నికలు దగ్గరపడుతున్నా కొద్దీ.. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు మరింత రక్తికట్టిస్తున్నాయి. ముఖ్యంగా నేతల కప్పదాట్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే అధికార పార్టీకి చెందిన కీలక నేతలు ఆ పార్టీని వీడగా.. మరికొందరు ఆ బాటలో నడుస్తున్నారు. తాజాగా వైసీపీకి మరో బిగ్ షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్. వైసీపీకి రాజీనామా చేశారు. చీరాల వైసీపీ టిక్కెట్ దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆమంచి, అప్పటి నుంచి ఆయన పార్టీ మారాలని యోచిస్తున్నారు. తాజాగా తన నిర్ణయాన్ని ఖరారు చేసుకున్నారు. పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాదు.. త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ఆమంచి కృష్ణ మోహన్ తెలిపారు.

# జగన్‌కు మరోఛాన్స్ లేదు

- ఇక నో చాన్స్ అంటూ ప్రచారం
- పాలకొల్లులో నేటి చంద్రబాబు రోడ్‌షోకు ఏర్పాట్లు

**భీమవరం, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

జగన్ విముక్త ఆంధ్రప్రదేశే తమ కూటమి లక్ష్యం అని పాలకొల్లు విపక్ష నేతలు స్పష్టం చేశారు. ఒక్క ఛాన్స్.. ఒక్క ఛాన్స్ అన్న వైసీపీకి ఇంకా నో ఛాన్స్.. అని తేల్చి చెప్పారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. రూ. 12 లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. జగన్ విముక్త ఆంధ్రప్రదేశే తమ కూటమి లక్ష్యంగా చెప్పారు నేతలు. ఒక్క ఛాన్స్.. ఒక్క ఛాన్స్ అన్న వైసీపీకి ఇంకా నో ఛాన్స్.. అని, ఈ ఎన్నికల్లో జగన్ తట్టాబుట్టా సర్దుకోవాల్సిందేనని చెప్పారు. జనాల చేతిలో వైసీపీ చావుదెబ్బ తినడం ఖాయం అన్నారు. పాలకొల్లులో శుక్రవారం సాయంత్రం జరగబోయే చంద్రబాబు నాయుడు రోడ్ షో కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు విపక్ష కూటమి నేతలు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బోణం చినబాబు మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక వివరాలు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు చంద్రబాబు నాయుడు రోడ్ షో, భారీ బహిరంగ సభ ఉంటుందని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు కూటమి నేతలు. పాలకొల్లు ÷ర్ స్టేషన్ సెంటర్ నుంచి గాంధీబొమ్మల సెంటర్ వరకు చంద్రబాబు రోడ్ షో ఉంటుందన్నారు. ప్రజాగళం సభను విజయవంతం చేయడానికి రైతులు, యువకులు, నిరుద్యోగులు కదిలి వస్తారని చెప్పారు. మహిళలు స్వచ్ఛందంగా గడపగడప నుంచి బయటకు వచ్చి కదం తొక్కుతారన్నారు. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వం పాలనా విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు విపక్ష నేతలు. బీసీలకు ఉన్న 34 శాతం రిజర్వేషన్‌లో 10 శాతం తగ్గించి 26 వేల రాజకీయ పోస్టులు పోగొట్టారని ఆరోపించారు. తెలుగుదేశానికి పాలకొల్లు నియోజకవర్గం కంచుకోట అని.. ఇప్పుడు జనసేన, బీజెపీ తోడు కావడంతో మరింత బలపడిందన్నారు. శుక్రవారం పాలకొల్లులో చంద్రబాబుకు ఘన స్వాగతం పలుకుతామని చెప్పారు.

# ప్రజావేదిక ధ్వంసం నుంచి విధ్వంస పాలన

- 175 సీట్లు ఇస్తే అడ్డూ అదుపు ఉంటుందా
- ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూటి ప్రశ్న

**విజయవాడ, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

ప్రజావేదిక ధ్వంసం నుంచి జగన్ విధ్వంస పాలన మొదలైందని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ ఐదేళ్లపాటు అదే కొనసాగిందన్నారు. గురువారం నాడు గొల్లపూడిలో టీఎన్ఎస్ఎఫ్ నేతలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తెలుగు నాడు విద్యార్థి సంఘం నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... గత ఎన్నికల్లో 151 అసెంబ్లీ సీట్లు ఇస్తేనే ఇంత దుర్మార్గంగా పరిపాలించారని.. ఇప్పుడు ఇంకా వై నాట్ 175 అసెంబ్లీ సీట్లు అంటూ అన్నింటిని గెలిస్తే ఇంకా ఈ రాష్ట్రంలో ప్రజలు, సామాన్యులు బతికే పరిస్థితి ఉంటుందా? అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో పేదలు ఎవరో..? పెత్తందారులు ఎవరో..? ప్రజలే తేల్చుకుంటారని చెప్పారు. సామాన్యుడి నెత్తిన పెత్తందారులను పెట్టింది ఎవరని ప్రశ్నించారు. తాను వైసీపీ టికెట్ ఇచ్చినా పోటీ చేయనని తేల్చిచెప్పానని కాబట్టే ఇది జగన్మోహన్ రెడ్డికి, కేపీకి మధ్య జరుగుతున్న పోటీ అంటున్నారని చెప్పారు. ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత యువకులదేనని అన్నారు. ఈ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి మహాకూటమిని గెలిపిద్దామని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి యువత భవిష్యత్తును పణంగా పెట్టారని మండిపడ్డారు. అమరావతి రాజధాని నాశనం చేసి, పరిశ్రమలు రాకుండా అడ్డుకొని కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెట్టారని ధ్వజమెత్తారు. మూడు రాజధానుల పేరిట ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టి అధికారం కోసం వైసీపీ ప్రభుత్వం ఎన్నో అరాచకాలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. పీలో పరిశ్రమలు పెట్టాలంటేనే పారిశ్రామికవేత్తలు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులాల వారీగా నాయకులను విడగొట్టి, ఏ కులం వారిని, ఆ కులం వారితోనే తిట్టించడం జగన్‌రెడ్డికి ఎంతవరకు సబబని నిలదీశారు. ఈ ముఖ్యమంత్రి ప్రజానాయకుడా? ముఠా నాయకుడా? అని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఎద్దేవా చేశారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌కే సాధ్యం









- బిఆర్ఎస్ ప్రతిపక్షంగా కూడా పనికిరాదు
- గత పాపాలకు బాధ్యత లేదన్నట్లుగా బిఆర్ఎస్ వైఖరి
- వ్యక్తిగత, రాజకీయ అవసరాలకు ట్యాపింగ్ దుర్వినియోగం
- బిఆర్ఎస్ చేసిన తప్పలను కాంగ్రెస్ చేయదు
- తెలంగాణలో 12 నుంచి 14 సీట్లు గెలవబోతున్నాం
- తుక్కుగూడ నుంచే కాంగ్రెస్ సమరశంఖం పూరిస్తాం
- డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

**రంగారెడ్డి, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏకైక దిక్కు కాంగ్రెస్ మాత్రమేనని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అవాస్తవాలు మాట్లాడే బీఆర్ఎస్ ప్రతిపక్షంగా కూడా పనికిరాదని ఎద్దేవా చేశారు. 10 ఏళు పాలించిన బీఆర్ఎస్ నాయకులు గత పాపాలకు బాధ్యత లేదంటే ఎలా అని నిలదీశారు. దేశ భద్రతకు వాడాల్సిన కమ్యూనికేషన్ వ్యవస్థను కేసీఆర్, కేటీఆర్ వ్యక్తిగత అవసరాలకు వినియోగించారని ధ్వజమెత్తారు. తుక్కుగూడలోని ' జన గర్జన' సభ ఏర్పాట్లను గురువారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కదం తొక్కుదాం.. కాంగ్రెస్ తడాఖా దేశానికి చాటుదామని పిలుపునిచ్చారు. తుక్కుగూడ ' జన గర్జన' సభ ఈ దేశానికి దిశానిర్దేశం చేయ నుందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోను తుక్కుగూడ సభ నుంచే ఏఐసీసీ నాయకత్వం ప్రకటించనుందని తెలిపారు. వ్యక్తిగత కుటుంబ జీవితాలు, వ్యాపారాలు, అధికారులు, జడ్జీలు ఏం మాట్లాడుకుంటున్నారో నిబంధనలకు విరుద్ధంగా బీఆర్ఎస్ నేతలు తెలుసుకున్నారని విరుచుకుపడ్డారు. జూన్ మాసంలో వచ్చిన వర్షాలను కేసీఆర్ ఒడిసి పట్టలేదన్నారు. అవసరం లేకున్నా గొప్పల కోసం నాగార్జున సాగర్ నీటిని కిందికి ఎందుకు వదిలారని ప్రశ్నించారు. 64.75 లక్షల మంది రైతులకు రైతుబంధును రైతుల ఖాతాల్లో వేశామని తెలిపారు. రైతుబీమా కింద రూ. 1500 కోట్ల ప్రీమియం ప్రభుత్వమే చెల్లించిందని అన్నారు. ప్రతినెలా ఒకటో తేదీనే ఉద్యోగులు, పెన్షనర్లకు జీతాలు అందజేస్తున్నామని చెప్పారు. 30 వేల ఉద్యోగాలను మూడు నెలల్లో ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశామని అన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు వరంగల్ నుంచి మహబూబ్‌నగర్ వరకు తుక్కుగూడ సభకు కదలి రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ చేతగాని తనం వల్లే తెలంగాణలో నీటి ఎద్దడి వచ్చిందని భట్టి విక్రమార్క అన్నారు. వర్షాకాలంలో పడిన వర్షాల కారణంగా వచ్చిన నీటిని వడిసి పట్టుకోకుండా ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు నీటిని ఎందుకు అందించడం లేదని మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అయినా రాష్ట్రంలో నీటి సమస్య ఉండకూడదని యుద్ధ ప్రాతిపదికన పనిచేసి నీటి సమస్య లేకుండా చేశామని చెప్పారు. పొలాల్లో పెట్టే దిష్టి బొమ్మల వలే పొలాల వెంట మాజీ సీఎం కేసీఆర్ తిరుగుతూ నీళ్లు అందించలేదని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దశాబ్ద కాలంలో కాంగ్రెస్ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 12 నుంచి 14 ఎంపీ సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో గతంలో ఉన్నవారు కూడా కాంగ్రెస్ నాయకులేనని బీఆర్ఎస్ ఖాళీ అవ్వడం ఖాయమన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు కాంగ్రెస్‌కి పోటీనే కాదని భట్టివిక్రమార్క చెప్పారు. దేశంలో బీజేపీ పతనం మొదలైందన్నారు. యువత భవిష్యత్ దృష్ట్యా ఆచి తూచి ఓటు వేయాలని కోరారు. మనందరి భవిష్యత్ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మనం వేసే ఓటు మీద ఆధారపడి ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను, వనరులను అల్లకల్లోలం చేసిన దుర్మార్గపు పార్టీకి ప్రజలు గుణ పాఠం చెప్పారన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఎవరినైనా ప్రశ్నించాలంటే భయం, రాయాలంటే భయపడే పరిస్థితుల నుంచి ప్రతి పౌరుడు ఓటు వేసి ఆ పార్టీని బొంద పెట్టారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని కరెంట్ సమస్యలు రాకుండా మెరుగైన విద్యుత్ అందిస్తామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి దగ్గర నుంచి మొదలు పెడితే తనతో పాటు ప్రతి మంత్రి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ వలే రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టం, పెట్టలేమన్నారు. సీఎం, మంత్రులు ఎవరు ఢిల్లీ వెళ్లిన ప్రజలకు కావాల్సిన సంక్షేమ పథకాలకు కావాల్సిన నిధులు తీసుకు రావడానికేనని వివరించారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి కావాల్సిన పనులకు అడ్డంకులు ఉంటే సీఎం రేవంత్ వెంటనే ఆ అడ్డంకులు తొలగించారని చెప్పారు. 10 ఏళ్ల నుంచి అభివృద్ధి పనులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికొదిలేస్తే వాటిని గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కేవలం మూడు నెలల్లో ఏయే శాఖల్లో పెండింగ్ పనులు ఉన్నాయో ఆ పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మ్మం జిల్లా సింగరేణి పుట్టిన ప్రాంతం, ఈ రోజు సింగరేణి గానీ, అత్యంత విద్యుత్ వెదజల్లే ప్రాంతమని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కూడా రవాణా ఖర్చు తగ్గించేందుకు కృషి చేస్తున్నార న్నారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా పని చేస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తుక్కుగూడ లో బహిరంగ సభ ఏర్పాటు చేసి 6 గ్యారెంటీలు ప్రకటించామని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ గ్యారెంటీలను అమలు చేశామని తెలిపారు. ఇప్పుడు అదే ప్రాంతంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి దేశంలో అమలు చేసే గ్యారెంటీల గురించి ఏఐసీసీ అగ్ర నేతలు ప్రకటిస్తారని అన్నారు. బహిరంగ సభను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ కలిసి విజయవంతం చేయాలని భట్టివిక్రమార్క పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్‌కి అధికారం ఇచ్చినందుకు ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారు

**ఎంపీ నామా నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అశ్వారావుపేట అసెంబ్లీలో బీఆర్ఎస్ కు తిరుగులేదన్నారు.. ఇక్కడ కృష్ణార్జునులలా మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు గొప్పగా పని చేస్తున్నారు అని తెలిపారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ అశ్వారావుపేట నుంచే వచ్చింది.. ఇప్పుడు కూడా అదే పునరావృతం కావాలి అని పేర్కొన్నారు. రాష్ట్రంలో వేసవి రాక ముందే నీటి ఎద్దడి నెలకొంది.. రాష్ట్ర వ్యాప్తంగా నీటి ఎద్దడి కారణంగా సుమారు 15 లక్షల ఎకరాల పంటలు దెబ్బ తిన్నాయని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ఎప్పుడూ గ్రామాలు పచ్చగా ఉండాలని కోరుకునే వారు.. ఆ విధంగానే సంక్షేమ పథకాలు కూడా ప్రవేశ పెట్టారు.. దేశంలో ప్రతీ ఇంటికి నల్లా నీరు ఇచ్చిన రాష్ట్రం ఏదని పార్లమెంట్ లో నేను ప్రశ్నిస్తే తెలంగాణ అని సమాధానం వచ్చింది అని నామా నాగేశ్వరరావు అన్నారు. అదే విధంగా వరి ఎక్కువ పండించే రాష్ట్రం ఏదంటే అక్కడ కూడా తెలంగాణనే ముందుంది.. ఈ ఘనత కేసీఆర్ దే అని బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు తెలిపారు. కాంగ్రెస్ కి అధికారం కట్టబెట్టినందుకు గ్రామాల్లో ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారు.. సర్వరోగ నివారిణిలా ప్రతీదానికీ డిసెంబర్ 9ని చూపెట్టారు. డిసెంబర్ దాటి 4 నెలలు అయ్యింది.. హామీలు అమలు చేయడం చేతగాక ఇప్పుడు కొత్త పాట మొదలెట్టారు.. అత్యధిక ఎంపీలు కట్టబెట్టండి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని అంటున్నారు.. గత పార్లమెంట్ లో తెలంగాణ తరపున గళమెత్తింది ఒక్క బీఆర్ఎస్ పార్టీనే.. తెలంగాణ ప్రజల సమస్యలను పార్లమెంట్ లో లెవనెత్తాలంటే రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని ఆయన చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో నేషనల్ హైవేస్ అభివృద్ధి జెట్ స్పీడ్ లో దూసుకుపోయింది.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేసి దీవించాలి.. ఖమ్మం జిల్లాలో కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది.. కాంగ్రెస్ నాయకులకు హెచ్చరించేది ఒక్కటే.. బిడ్డా బీఆర్ఎస్ కార్యకర్తల జోలికి వస్తే ఆగమాగం చేస్తామని నామా నాగేశ్వరరావు హెచ్చరించారు.

# ఎన్నికల నిర్వహణకు తగు చర్యలు తీసుకుంటున్నాం





- **జిల్లా కలెక్టర్ డా.జి.సృజన**

**కర్నూలు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

ఎన్నికల నిర్వహణకు అవసరమైన తగు చర్యలు తీసుకుంటామని రాజకీయ పార్టీ ప్రతినిధులకు జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డా.జి.సృజన తెలియజేశారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫార్మ్-6, 8 లను ఏప్రిల్ 16 వరకు స్వీకరించి వాటిని ఏప్రిల్ 25వ తేది నాటికి డిస్పోజ్ చేయడం జరుగుతుందన్నారు. ఎంసిసికి సంబంధించి ఇప్పటి వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పాటించని 32 మంది ఉద్యోగస్తులపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఎగ్జిట్/ఓపినియన్ పోల్స్ నిర్వహించ కూడదన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎపిక్ కార్డుకి బదులుగా 12 వివిధ గుర్తింపు కార్డులైన ఆధార్‌కార్డు, ఎంఎన్ఆర్‌జీఏ జాబ్‌కార్డు, పోస్టాఫీస్ లేదా బ్యాంక్ జారీ చేసిన ఫొటోతో ఉన్న పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, ఫొటోతో కూడిన పింఛన్ మంజూరు డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ కార్డు, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికార గుర్తింపు పత్రం, విభిన్న ప్రతిభావంతుల ఐడెంటిటీ కార్డు, ఏదైనా ఒక గుర్తింపు కార్డులను తీసుకొని పోలింగ్ కేంద్రంలో చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు అన్నారు. ఎపిక్ కార్డులకు సంబంధించి ఇప్పటి వరకు 2లక్షల 65వేలు ప్రింట్ చేయడం జరిగిందన్నారు, ఇంకొక 60వేలు ప్రింటంగ్ లో ఉన్నాయన్నారు. వీటిలో 2లక్షల 40వేలు పోస్టల్ శాఖ ద్వారా డెలివరీ చేయడం జరిగిందని, ప్రింటింగ్ లో 60వేలు, మిగిలిన 20 వేలు ఎపిక్ కార్డులను కూడా త్వరితగతిన పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్ కు సంబంధించి రాయలసీమ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ బ్లాక్ లో 4 నియోజకవర్గాలు, లైఫ్ సైన్సెస్ బ్లాక్ లో 2 నియోజకవర్గాలు, లైబ్రరీలో 2 నియోజకవర్గాలు ఏర్పాటుకు సంబంధించిన ఎన్నికల కమీషన్ కు ప్రతిపాదనలు పంపండి జరిగిందని వారి నుంచి ఆమోదం రాగానే ఏ రూమ్ ఏ నియోజకవర్గానికి అనేది తెలియజేస్తామన్నారు. జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించేందుకు సరిపడా పిఓలు, ఏపిఓలు (ప్రభుత్వ ఉద్యోగులు) ఉన్నారా లేదా అని ఎన్ఐసి ద్వారా ట్రయిల్ రన్ నిర్వహిస్తామన్నారు. పిఓలకు, ఏపిఓలకు ఇది వరకే శిక్షణ ఇవ్వడం జరిగిందని, ఓపిఓలకు శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఇప్పటి వరకు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగస్తులకు అనుమతి లేదన్నారు. పోస్టల్ బ్యాలెట్ కు సంబంధించి ఎన్నికల విధులలో ఉన్న వారితో పాటు అత్యవసర సర్వీసులైన 33 శాఖలకు చెందిన వారికి పోస్టల్ బ్యాలెట్ అందజేయడం జరుగుతుందన్నారు. 85 సం.లు, విభిన్న ప్రతిభావంతులైన ఓటర్లకు సంబంధించి హెూం ఓటింగ్ కు ఎన్నికల కమీషన్ ఆదేశాల ఇచ్చినందున, సదరు అవకాశాన్ని ఎవ్వరూ దుర్వినియోగ పరచకుండా నిజంగా ఓటర్లు ఇంటి నుంచి రాలేరా అనే దానిపై సర్వే చేయించి నిర్ధారణ చేసుకున్న తరువాత మాత్రమే ఆర్ఓ ద్వారా వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. అందుకు సంబంధించిన సర్వేను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని, ఇందుకు రాజకీయ పార్టీ ప్రతినిధులు కూడా సహకరించాలన్నారు. ఈవిఎం గోడౌన్ లో ఏప్రిల్ 12వ తేదిన ఈవిఎం మిషన్ల మొదటి విడత సంబంధించి ర్యాండమైజేషన్ చేయడం జరుగుతుందని, సదరు ప్రక్రియలో ఈవిఎం మిషన్లను నియోజకవర్గాలకు కేటాయించడం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించి రాజకీయ పార్టీ ప్రతినిధులు మొత్తం ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం రాజకీయ పార్టీ ప్రతినిధులు అనుమతుల జారీ విషయంలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు విన్నవించారు. సమావేశంలో డిఆర్ఓ మధుసూదన్ రావు, వైయస్సార్సీపి స్టేట్ లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ కె.పుల్లారెడ్డి, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి చంద్రహాస్, బిజెపి జిల్లా జనరల్ సెక్రెటరీ బి.కోటేశ్వర్లు, సిపిఐ పార్టీ ప్రతినిధి కె.వి.నారాయణ, బీఎస్పీ జిల్లా ఇంఛార్జి జి.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు తాటాకు చప్పుళ్లకు భయపడం






- **వైసీపీ ఎమ్మెల్యేలుగా రాంపురం రెడ్డి సోదరులు ముగ్గురు గెలుస్తాం**
- **ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు తమకు ఓటమి లేదు**
- **ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి వెల్లడీ**

**పెద్దకడబూరు, ఏప్రిల్ 04 (శ్రీచక్ర) :**

టీడీపీ అధినేత చంద్రబాబు తాటాకు చప్పుళ్లకు భయపడే వారెవరూ ఇక్కడ లేరని, వైసీపీ ఎమ్మెల్యేలుగా రాంపురం రెడ్డి సోదరులు ముగ్గురు గెలుస్తామని కాసుకో చంద్రబాబు అంటూ మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చంద్రబాబుకు సవాల్ విసిరారు. గురువారం పెద్దకడబూరు మండలంలోని తారాపురం శ్రీ గిడ్డాంజనేయస్వామి సాక్షిగా ఎన్నికల ప్రచారానికి శంఖారావం ఊదారు. ముందుగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి శ్రీ గిడ్డాంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి పాదుకలను తలపై ధరించి ప్రదక్షిణలు చేశారు. అనంతరం జరిగిన ఎన్నికల ప్రచార సభలో బాలనాగిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల ఎమ్మిగనూరులో జరిగిన ప్రజాగళం సభలో చంద్రబాబు తమపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ తాటాకు చప్పుళ్లకు భయపడే వంశం రాంపురం రెడ్డి సోదరులది కాదని హెచ్చరించారు. ఏళ్ల తరబడి మంత్రాలయం, ఆదోని, గుంతకల్ నియోజకవర్గాల ప్రజలకు సేవలు చేస్తూ వారి ఆశీస్సులతో ఎమ్మెల్యేలుగా గెలుస్తున్నామని, చంద్రబాబు మాదిరిగా మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తూ పూటకో మాట చెప్పడం లేదని మండిపడ్డారు. వలస పక్షులు ఎవరో నిజమైన ప్రజా సేవకులెవరో కుప్పం ప్రజలను బాబు అడిగి తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు. 2014లో 600 హామీలు ఇచ్చి ముఖ్యమంత్రి గద్దెనెక్కిన చంద్రబాబు ప్రజలను ఏ విధంగా మోసం చేశారో ఏపీ ప్రజలందరికీ తెలుసని, మరోమారు ఆరు గ్యారెంటీల పేరు ప్రజలను మభ్యపెట్టడానికి చూస్తున్నారని, టీడీపీ నేతల మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు. మంత్రాలయంలో తనకు ప్రత్యర్థిగా బాబు ఎవరిని బరిలో దింపినా విజయం వైసీపీదేనని బాబుకు సవాల్ విసిరారు. పేదలకు మంచి జరిగితే ఓర్చుకొనే స్థితిలో చంద్రబాబు లేరని అన్నారు. పేదల సంక్షేమ పథకాల అమలుపై పలుమార్లు తన అనుచరులతో కోర్టులలో కేసులు వేయించిన ఘనుడు చంద్రబాబు అని మండిపడ్డారు. అలాంటి బాబును నమ్మొద్దని, పేదలకు మళ్లీ సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్ జగన్ ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని, మంత్రాలయం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే తనను నాల్గోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ వైసీపీ అభ్యర్థుల ఫ్యాన్ గుర్తులపై ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

**పెద్దకడబూరు నుండి 15 వేలు మెజారిటీ ఇస్తాం..**

వచ్చే ఎన్నికల్లో మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి పెద్దకడబూరు మండలం నుండి 15 వేలు మెజారిటీ ఇస్తామని వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. జగన్ సంక్షేమ పథకాల ద్వారా మండలంలోని వివిధ గ్రామాలలో రాజకీయాలకు అతీతంగా 90 శాతం ఇళ్లకు లబ్ధి చేకూరిందని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, రైతులు, యువత వైసీపీ అండగా ఉన్నారని, అందుకే మంత్రాలయం నియోజకవర్గంలో వైసీపీకి అత్యధిక మెజారిటీ సాధించి పెడతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ప్రదీప్ రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరి, ఎంపీటీసీలు అనితమ్మ, వెంకటేష్, గ్రామ సర్పంచులు లక్ష్మమ్మ, చంద్రశేఖర్, చిన్న మహదేవ, హనుమంతు, ఇస్మాయిల్, నాగరాజు, వైసీపీ నాయకులు భీమ్ సేనరావ్ కౌశిక్, గజేంద్రరెడ్డి, నరవ రాజశేఖర్ రెడ్డి, నరేష్ కుమార్ గౌడ్, జాము మూకయ్య, పూజారి ఈరన్న, ముక్కరన్న, మూకిరెడ్డి, అర్లప్ప, బజారి, నాగప్ప, ఆంజనేయులు, ఉసేని, యంకప్పస్వామి, షేర్ ఖాన్ పటేల్, మహదేవ, డీలర్ అయ్యప్ప, పెద్దయ్య, యోగేంద్ర, నారాయణప్ప, మాదవరెడ్డి, శివరాములు, బాలయ్య, లింగారెడ్డి, అంపయ్య, కంబళదిన్నె ఈరన్న, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తాం

- **శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుబుధేంద్ర తీర్థులు**



**మంత్రాలయం, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

జర్నలిస్టులకు శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుబుధేంద్ర తీర్థులు అన్నారు. గురువారం ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ పిలుపు మేరకు మంత్రాలయం ఏపీయూడబ్ల్యూజే తాలూకా కమిటీ, మండల కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో, ఏపీయూడబ్ల్యూజే టోపీలను శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, వేసవికాలం లో జర్నలిస్టులు వార్తలు కవరేజ్ కు వెళుతుంటారని వారిని దృష్టిలో ఉంచుకుని ఈ టోపీలను మఠం తరపున ముద్రించి ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మంత్రాలయం నియోజకవర్గం లోని కౌతాళం, కోసిగి, మంత్రాలయం, పెద్ద కడుబూరు మండలాలకు చెందిన 120 మంది జర్నలిస్టులకు టోపీలను పీఠాధిపతులు అందజేశారు.అనంతరం జర్నలిస్టుల కు పీఠాధిపతులు ఫల మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు చాంద్ బాషా మంత్రాలయం ఏపీడబ్ల్యూజే తాలూకా అధ్యక్షులు జయరాజు, ప్రధాన కార్యదర్శి ఉసేని, కోశాధికారి సాబువలి, సీనియర్ పాత్రికేయులు మాధవ్ ,మండల గౌరవ అధ్యక్షులు రానోజి రావు, అధ్యక్షులు భీమ రాయ్, ఉపాధ్యక్షులు నాగరాజు కోశాధికారి రఫీ, ప్రధాన కార్యదర్శి వెంకటరాజ్, సీనియర్ పాత్రికేయులు గోవిందు, ఎనుముల ఈరన్న, రామస్వామి, శ్రీధర్, కంతం నరసింహ, బాబురావు, వీరేష్ , తిమ్మారెడ్డి, సతీష్, శివ, కోసిగి, కౌతాళం, పెద్దకడబూరు మండలాల నుంచి జర్నలిస్టుల నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో ఎంతో కొంత భాగాన్ని సామాజిక సేవకు వినియోగించాలి

- **రంజాన్ తోఫా అందించిన సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ**



**కర్నూలు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో ఎంతో కొంత భాగాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించాలని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శేఖర్ శర్మ అన్నారు. కర్నూల్ నగరంలోని గాయత్రి ఎస్టేట్లో ఉన్న గురుదత్త పాలి క్లినిక్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పేద ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు ఎంతో దీక్షతో ఉపవాస దీక్షలు చేపడతారని ఆయన వివరించారు. పవిత్ర రంజాన్ సందర్భంగా పేద ముస్లిం కుటుంబాలు కూడా సంతోషంగా పండుగ జరుపుకోవాలన్న ఉద్దేశంతో పేద ముస్లిం మహిళలకు తన వంతు బాధ్యతగా రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేసినట్లు వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఒక వయసు దాటిన తర్వాత సామాజిక సేవ భావాలను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. సొంత లాభం కొంత మానుకొని పొరుగు వారికి సేవ చేయాలన్న సూక్తిని ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన కోరుతూ తనవంతు బాధ్యతగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం వేసవి మండుటెండలు అధికంగా ఉండటం వల్ల వేసవి మండుటెండల కు గురి కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ నీటిని అధికంగా తీసుకోవాలని లేదంటే నీటి శాతం తగ్గిపోవడం వల్ల మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉందని వివరించారు. అలాగే పరిశుభ్రమైన నీటిని తాగడం మర్చిపోరాదని, కలుషితమైన నీటిని తాగితే టైఫాయిడ్, జాండీస్, కలరా ,విరోచనాలు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆయన వివరించారు .ముస్లిం సోదరులందరికీ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా శుభాకాంక్షలు సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు సుమలత తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతలు సిగ్గుపడాలి..

**హైదరాబాద్, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

గతంలో అన్ని రంగాల్లో అవినీతి రాజ్యం ఏలింది అని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. గతంలో చేసిన తప్పులను రిదిద్దుకుంటూ ఈ ప్రభుత్వం ముందుకు వెళుతుంది తెలిపారు. వర్షాలు సరిగ్గా లేకపోవడం వల్ల ప్రాజెక్ట్ లలో నీళ్లు లేవు.. నాగార్జున సాగర్ లో గేట్లు ఎత్తిన నీళ్ళు రాని పరిస్థితి నెలకొంది.. ఈనాడు మంచి నీళ్లను ప్రక్క రాష్ట్రాల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పాడింది. సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారు.

# ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోండి

- పాణ్యం నియోజకవర్గ ఆర్వో/ జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య

**కల్లూరు, ఏప్రిల్ 4(శ్రీచక్ర):**

నియోజకవర్గంలోని ఓటర్లు తమ ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకోవాలని పాణ్యం నియోజకవర్గ ఆర్వో/ జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. గురువారం స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామము లో జిల్లా పరిషత్ హై స్కూల్ నుండి పాత బస్టాండ్ వరకు నిర్వహించిన ఓటర్ల అవగాహన ర్యాలిలో పాణ్యం నియోజకవర్గ ఆర్వో/జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పాల్గొన్నారు. పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం లోని ఉలిందకొండ, పందిపాడు, లక్ష్మీపురం, పెద్దటేకూరు, కొంగనపాడు గ్రామాలలోని పోలింగ్ స్టేషన్ పరిశీలించారు. ఆమె నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఓటర్లు తమ ఓటు హక్కును ఖచ్చితముగా వినియోగించుకోవాలని ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణంలో నచ్చినవారికి ఓటు వేసుకోవచ్చని అన్నారు.స్వీప్ సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం" కార్యక్రమంలో భాగంగా ఈరోజు ర్యాలీని నిర్వహించుకోవడం జరిగింది అన్నారు. ఓటు హక్కు కలిగి ప్రతి ఓటరు తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా యువ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుని, ఓటర్లను చైతన్యపరిచి ఓటు వినియోగించుకునేలా చేసి పోలింగ్ శాతాన్ని పెంచాలని జాయింట్ కలెక్టర్ ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ మునివేలు, బూత్ స్థాయి అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





## వాలంటీర్ వ్యవస్థకు టిడిపి వ్యతిరేకం కాదు

- కర్నూలు టిడిపి అభ్యర్థి టి.జి భరత్



**కర్నూలు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర):**

వాలంటీర్ వ్యవస్థకు తెలుగుదేశం పార్టీ వ్యతిరేకం కాదని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టి.జి భరత్ అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ తమ పార్టీ రాజకీయాలు చేసే వాలంటీర్లకు మాత్రమే వ్యతిరేకమని చెప్పారు. రాబోయే మా ఎన్డీఏ ప్రభుత్వం వాలంటీర్లకు న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులే పింఛన్లు పంపిణీ చేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందన్నారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లను పంపిణీ చేయించాలని టి.జి భరత్ పేర్కొన్నారు. పేదలు, వృద్ధులు, వికలాంగులకు ఇచ్చే పింఛన్ల విషయంలో రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదని చెప్పారు. 2014లో చంద్రబాబు సీఎం అయిన తర్వాత రూ. 200 ఉన్న పింఛన్‌ను రూ. 2 వేలకు పెంచినట్లు తెలిపారు. ఇప్పుడు మళ్ళీ తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ. 4 వేలు పింఛన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పింఛన్ల పంపిణీ విషయంలో రాజకీయాలు చేయడం కరెక్టు కాదన్నారు.

## ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కలిసి కాంగ్రెస్ నేత



**పెద్దకడబూరు, ఏప్రిల్ 04 (శ్రీచక్ర) :**

ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంత్రాలయం తాలూకా కాంగ్రెస్ నాయకులు కంబదహాల్ కు గోవర్ధన్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రాలయం ఎమ్మెల్యే సీటు తనకే కేటాయించాలని గోవర్ధన్ రెడ్డి వైఎస్ షర్మిలను కోరారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి ఫోన్ విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత 9 గ్యారెంటీ పథకాలను అమలు చేస్తుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయిన వెంటనే ఏపీకి ప్రత్యేక హెూదాకు సంతకం పెడతారని తెలిపారు. రెండు లక్షలు రైతు రుణమాఫీ, మహాలక్ష్మి పథకం ద్వారా పేద మహిళలకు ప్రతి నెల రూ. 8500, ఉపాధి హామీ కూలీకి రోజుకి కనీసం రూ. 400 వేతనం, ఇల్లు లేని వారికి ఐదు లక్షలతో ఇంటి నిర్మాణం చేపడతామన్నారు. వృద్ధులకు, వితంతువులకు 4000 పెన్షన్, వికలాంగులకు 6000 పెన్షన్ ఇస్తామని, మొదటి సంవత్సరం కేంద్రం ద్వారా 30 లక్షలు, రాష్ట్రం ద్వారా 2.25 లక్షలు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. రైతు పెట్టుబడి మీద 50 శాతం లాభంతో మద్దతు ధర, ఉచిత విద్య కేజీ టు పీజీ వరకు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంత్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మిరెడ్డి, సత్యరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రమేష్, బ్రహ్మానందరెడ్డి, నాగేష్ పాల్గొన్నారు.

## ఎన్నికల కమిషన్ ని కలిసిన సమాజ్ వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు

**ఒంగోలు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**



ఆంధ్రప్రదేశ్ సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా ని మర్యాద మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ముఖేష్ కుమార్ మీనా తో మాట్లాడుతూ 24 లో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకి ఎన్నికల కమిషన్ నుంచి కావలసిన ప్రతి ఒక్క సహాయ సహకారాలు సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థులకి అందించాలని జిల్లా, మండలం, రెవిన్యూ ఆఫీస్, ఎంపీడీవో ఆఫీస్ నుండి ప్రతి ఒక్క ఆఫీసు నుండి అభ్యర్థులకు సహకరించాలని, వాళ్లకు కావాల్సిన ప్రతి ఒక్క ప్రాథమిక సమాచారం కచ్చితంగా అందజేయాలని, ఎన్నికల కమీషన్ నిర్వహించే ప్రతి కార్యక్రమాల సమాచారం సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థులకి కచ్చితంగా అందించాలని కోరారు. పాశంతో పాటు ములాయం సింగ్ యాదవ్ రాష్ట్ర యూత్ అధ్యక్షులు కళ్యాణ్ కుమార్ కూడా ఎలక్షన్ కమిషన్ ని కలవడం జరిగింది.

## ముస్లింల పక్షపాతి వైఎస్ జగన్మోహన్ రెడ్డి

- ముస్లిం కుటుంబాల అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం అండగా నిలిచింది చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి
- చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి




**పామూరు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముస్లిం పక్షపాతి అని, ముస్లిం కుటుంబాల అభివృద్ధికి గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందని ఒంగోలు పార్లమెంటు వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్, కనిగిరి నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని విరువూరు రోడ్డు నందు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ ఇఫ్తార్ విందుకు పట్టణంలోని ముస్లిం సోదరులు, వైసీపీ నాయకులు కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దద్దాల నారాయణ యాదవ్, కదిరి బాబురావు, బుర్ర మధుసూదన్ యాదవ్, గంగసాని హుస్సేన్ రెడ్డి, యాదాల వెంకట సాయి కిరణ్, చప్పిడి సుబ్బయ్య, కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్ రెడ్డి, కేతు రమేష్ రెడ్డి, షేక్ గయాజ్, షేక్ చాంద్ బాషా బుజ్జి భాయ్, కోఆప్షన్ సభ్యులు షేక్ నాయబ్ రసూల్ పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న యాదాల

**పామూరు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**



చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో రంజాన్ మాసం సందర్భంగా నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న పట్టణ ఉపసర్పంచ్ యాదాల వెంకట సాయి కిరణ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఈ ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

## టిడిపి వస్తే 20 లక్షల ఉద్యోగాలు

- 6 గ్యారంటీలు ఐదేళ్లలో చేస్తా
- సుబేదార్ వీధిలో టిజి భరత్ భరోసా యాత్ర



**కర్నూలు, ఏప్రిల్ 4(శ్రీచక్ర):**

తమ తెలుగుదేశం ప్రభుత్వం వస్తే రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు వస్తాయని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. గురువారం రాత్రి నగరంలోని రెండో వార్డు పరిధిలోని పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్ నుండి ఆయన టీజీ భరత్ భరోసా యాత్ర చేపట్టారు. అక్కడి నుండి సుబేదార్ వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి తెలుగుదేశం పార్టీ గెలిస్తే ఎంత లాభం ఉంటుందో వివరించారు. మంచి నాయకుడు, మంచి ప్రభుత్వం ఉంటే పరిపాలన సాఫీగా సాగుతుందని టీజీ భరత్ చెప్పారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసినప్పుడే సరైన నాయకుడు గెలిచేందుకు అవకాశం ఉంటుందన్నారు. కర్నూల్ లో తనను గెలిపిస్తే 6 గ్యారంటీలు తప్పకుండా అమలు చేసి నగరాన్ని అభివృద్ధిలో ముందంజలో ఉంచుతానని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి మెగా జాబ్ మేళా నిర్వహించి యువతకు ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ గెలిచేది ఖాయమని కర్నూల్ లో తనను గెలిపిస్తే అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే రెండు ఓట్లు తెలుగుదేశం పార్టీకే వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ కమిటీ నగర అధ్యక్షుడు హమీద్, బూత్ ఇంఛార్జీలు, తదితరులు పాల్గొన్నారు.


## ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్

**ఒంగోలు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

జిల్లా కలెక్టరుగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ శ్ఏ.ఎస్.దినేష్ కుమార్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు. తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసినారు.



# మేకపాటి సమక్షంలో వైసిపిలో చేరిన బీసీ నేత మాధవరావు





- యూనిట్ ఇంచార్జ్ మల్లంపాటి వెంగయ్య అనుచరుడు వైసీపీలో చేరిక
- బీసీల్లో ప్రధాన అనుచరుడుగా ఉన్న చల్లకొలుచు మాధవరావు, ఇద్దరు వార్డు మెంబర్లు వైసీపీలో చేరిక

**ఉదయగిరి/వరికుంటపాడు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు మండలం లో తూర్పు రొంపిదొడ్ల గ్రామ పంచాయతీకి చెందిన యూనిట్ ఇంచార్జ్ మల్లంపాటి వెంగయ్య ప్రధాన అనుచరులు బీసీ నాయకులు చల్లకొలుచు మాధవరావు అలాగే నందిపాటి జాషువా, ఇండ్ల జకరయ్య తదితరులు గురువారం నాడు నియోజకవర్గ వైసిపి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. వివరాల్లోకి వెళితే బీసీ యువ నాయకుడిగా మాధవరావు గ్రామంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని తెలుగుదేశం పార్టీకి అన్ని విధాలుగా ఆర్థికంగా సామాజికంగా ఎంతో అండగా నిలిచారు. అటువంటి వ్యక్తి పార్టీ మారడంతో తెలుగుదేశం పార్టీకి తీవ్రంగా నష్టం కలిగింది. యూనిట్ ఇంచార్జ్ మల్లంపాటి వెంగయ్య అనుచరులుగా ఉన్నటువంటి గ్రామంలోని కొంతమంది పెద్దలు అతని వ్యవహార శైలి నచ్చక, సొంత కుంపటి పెట్టుకోవడం, వెంటనే బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రధాన అనుచరుడుగా ఉన్నటువంటి వ్యక్తి మాధవరావు వైసీపీలో చేరడం, అలాగే మరో ఇద్దరు అనుచరులు రెండు సామాజిక వర్గాల్లోని టిడిపి వార్డ్ సభ్యులు వైసీపీలో చేరడంతో గ్రామంలో తెలుగుదేశం పార్టీ బీటలు వాటిల్లింది. ఇప్పటికైనా తెలుగుదేశం పార్టీ అధిష్టానం గ్రామంలో పార్టీ నాయకులను సమన్వయం చేసే ముందుకు వెళ్లకపోతే గ్రామంలో మరింత నష్టం జరిగే అవకాశం ఉందని తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు అభిమానులు అనుకుంటున్నారు. గ్రామంలో తెలుగుదేశం పార్టీలో విభేదాలు ఉన్నాయని మండల నాయకత్వానికి తెలిసిన కూడా వాటిని పరిష్కరించకపోగా కేవలం ఒంటెద్దు పోకడలకు పోతు పార్టీని నష్టపరుస్తున్నారని గ్రామంలోని నాయకులు కార్యకర్తలు అభిమానులు మండల నాయకత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నియోజకవర్గ అధినేత ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామంలోని పార్టీ పరిస్థితిని చక్కదిద్దాలని తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు కోరుచున్నారు.

## కార్మికులకు ఓటర్ల అవగాహన సదస్సు

**ఒంగోలు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**




ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు భగీరథ కెమికల్స్ లిమిటెడ్, చెరువు కొమ్ము పాలెంలోని ఫ్యాక్టరీ ఆవరణంలో జరిగిన ఓటర్ల అవగాహన సదస్సు (స్వీప్) కార్యక్రమంలో కార్మికులు రానున్న ఎన్నికలలో ఓటింగ్ పై అవగాహన సదస్సు, కార్మిక శాఖ ఉప కార్మిక కమిషనర్ ఎస్ శ్రీనివాస్ కుమార్ నిర్వహించినారు. ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ ,తన కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులకు, తెలియజేసి ఓటింగ్లో పాల్గొనాలని తెలిపినారు .పిఎస్ జ్యోతి మోడల్ ఆఫీసర్ పాల్గొని కార్మికులకు ఓటింగ్ పట్ల అవగాహన కల్పించారు. సమావేశంలో సహాయ కార్మిక కమిషనర్ పవన్ కుమార్ బి అనిత వాణి సహాయ కార్మిక అధికారి ఒంగోలు 1 ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ,ప్రతి ఓటు నిర్భయంగా ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు వేయాలని తెలిపినారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైసీపీ నాయకులకు ధన్యవాదాలు తెలిపిన గయాజ్



**పామూరు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

ఒంగోలు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న నాయకులకు వైసీపీ కార్యకర్తలకు పట్టణ ముస్లిం సోదరులకు పట్టణ సచివాలయాల కన్వీనర్ షేక్ గయాజ్ ధన్యవాదాలు తెలిపారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైసీపీ నాయకులకు ధన్యవాదాలు తెలిపిన యాదాల

**పామూరు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**



ఒంగోలు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైసీపీ నాయకులకు, వైసీపీ కార్యకర్తలకు పట్టణ ముస్లిం సోదరులకు పట్టణ ఉప సర్పంచ్ యాదాల వెంకట సాయి కిరణ్ ధన్యవాదాలు తెలిపారు.

## చెవిరెడ్డి,దద్దాలను మర్యాదపూర్వకంగా కలిసిన గంటా రమణయ్య



**పామూరు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

రంజాన్ మాసం సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని విరువూరు రోడ్డు నందు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని, దద్దాల నారాయణ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి వైసీపీ నాయకులు గంటా రమణయ్య. గంటా మధులు.

## టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్‌ను ఆశీర్వదించండి

- తనయుడు గెలుపు కోసం తల్లి తండ్రులు ప్రచారం





**ఉదయగిరి/జలదంకి, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

ఉదయగిరి తెదేపా ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ గెలుపు కోసం తల్లిదండ్రులు వెంకట సుబ్బానాయుడు, ప్రమీలమ్మ ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. గురువారం నాడు జలదంకి మండలంలోని కమ్మవారి పాలెం గ్రామం లో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ముందుగా టిడిపి అభ్యర్థి కాకర్ల సురేష్ తల్లిదండ్రులు కాకర్ల వెంకట సుబ్బానాయుడు ప్రమీలమ్మ, అత్తమామలు కడియాల వెంకటేశ్వర్లు పద్మావతి దంపతుల మండల టిడిపి నేతలతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళా నేత వంటేరు పద్మావతి, మహిళలతో కలిసి ఉదయగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాకర్ల సురేష్, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లను గెలిపించాలని ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ పులుగుంట మధుమోహన్ రెడ్డి, వంటేరు జయచంద్ర రెడ్డి, పూనూరు భాస్కర్ రెడ్డి, మందపల్లి మాల్యాద్రి యాదవ్, కంచర్ల వినోద్ నాయుడు, అప్పలనాయుడు, గంట అశోక్, జనసేన నేత నిమ్మలపల్లి రామచైతన్య, బిజెపి నేత వంటేరు రాకేష్ రెడ్డి, గద్దె బ్రహ్మయ్య యాదవ్, దివి లోకేష్ నాయుడు, స్వర్ణ కొండప నాయుడు, వేలమూరి మహేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, వేల్పుల వేణుగోపాల్ తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరికుంటపాడు మండలంలో వైకాపాలోకి వలసల జోరు

- వైకాపా లో చేరిన తూర్పు రొంపిదొడ్ల గ్రామానికి చెందిన తేదేపా బిసి నాయకుడు ఎంపీటీసీ అభ్యర్థి గా పోటీచేసిన చల్లకోల్చు మాధవ రావు మరియు వార్డ్ మెంబర్ లు ఇండ్ల జగరయ్య, నందిపాటి జాషువ
- ఆయనతో కలిసి వై సీ పి తీర్థం పుచ్చుకున్న 70 కుటుంబాలు



**ఉదయగిరి/దుత్తలూరు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

దుత్తలూరు మండలం లోని వైసిపి పార్టీ నియోజకవర్గ కార్యాలయం లో వరికుంటపాడు మండలానికి చెందిన తూర్పు రొంపి దొడ్ల తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు మాధవరావు, ఇద్దరు వార్డు మెంబర్లు, తదితరులు వైసిపి కండువాలు కప్పి సాదరంగా అహ్వానించిన ఉదయగిరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేకపాటి రాజ గోపాల్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి వైసీపి తోనె జరుగుతుందని అలాగే జగనన్న పథకాలు కి ఆకర్షితులయ్యి పార్టీ లో చేరారని తెలిపారు. రొంపిదొడ్ల ప్రజలు ఒక్క అవకాశం నాకు ఎమ్మెల్యే గా ఎంపీ గా విజయ సాయిరెడ్డి కి ఇచ్చి గెలిపించండి.. మీకు సేవ చేసుకునే భాగ్యం కల్పించండి అని ఆయన కోరారు .ఈ కార్యక్రమంలో వరికుంటపాడు మండల పార్టీ అధ్యక్షులు ఎమ్. తిరుపతి నాయుడు, మాజీ ఎ ఎమ్ సీ ఛైర్మన్ అలీ అహ్మద్, ఎంపిపి భర్త మల్లికార్జున, జె సీ ఏస్ కన్వినర్ బి. వెంకటేశ్వర్లు రెడ్డి, బీసీ సెల్ నాయకులు పి. మల్లికార్జున్, జిల్లా మహిళా కార్యదర్శి బత్తిన కొండమ్మ, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలానీ జిల్లా యూత్ కార్యదర్శి బొల్లా మురళీ, గుమ్మడి మధు, కొండయ్య, వెంకట రత్నం, కొండయ్య, అల్లూరి శీను, కొండలరావు, అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలను, పాలనను ప్రభుత్వం గాలికి వదిలేసింది

**సూర్యాపేట, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ (నందికొండ)లో వానరాలు చనిపోయిన డ్రింకింగ్ వాటర్ ట్యాంక్‌ను మాజీ మంత్రి జగదీష్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలను, పాలనను గాలికి వదిలేసిందన్నారు. ప్రభుత్వం సాగు, తాగు నీటి సమస్యను పరిష్కరించడంలో విఫలమైందని, కోతులు చనిపోయిన వాటర్ టాంక్ నీరు తాగిన వారందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు జగదీష్ రెడ్డి. నాగార్జునసాగర్ ను మున్సిపాలిటీగా చేసి, అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ అని, 2014కు ముందు ఉన్న రోజులు పునరావృతం అవుతున్నాయన్నారు. ఇప్పటికి గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు అల్లాడుతున్నారు. సాగునీటికి నీళ్లు అందించమంటే కూడా ప్రభుత్వానికి చేతకాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ బయటకి రాగానే ప్రాజెక్టుల నుంచి నీళ్లను వదిలారని గుర్తు చేశారు. ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో తాగు నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# కోట పంచాయతీ పరిధిలో 23 మంది వాలంటీర్లు రాజీనామా

**కోట, ఏప్రిల్ 4 (శ్రీచక్ర):**



కోట మండలం కోట పంచాయతీ పరిధిలోని మూడు సచివాలయాలకు చెందిన 23 మంది గ్రామ వాలంటీర్లు వారి విధులకు స్వచ్ఛందంగా రాజీనామ చేయడం జరిగింది.ఈ సందర్భంగా గురువారం వారి రాజీనామ లేఖలను కోట మండల పరిషత్ అభివృద్ధి అధికారి శంకరయ్య కు అందించారు.ఈ మేరకు వాలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేయవద్దని ఎన్నికల విధుల నుండి కూడా దూరంగా పెట్టాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశించిన సంగతి తెలిసిందే.దీంతో వాలంటీర్లు రోజురోజుకు మూకుమ్మడి రాజీనామాలు సిద్ధపడుతున్నారు. అనంతరం పలువురు వాలంటీర్లు మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలుగా లబ్దిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందజేసి,నిస్వార్థ సేవలు చేశామని,ఎలాంటి రాజకీయాలకు ప్రభావితం కాకుండా ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు.అయితే కొంత మంది ప్రతిపక్ష నాయకులు వాలంటీర్ల సేవలను రాజకీయ దృష్టితో చూస్తూ ఈసీకి ఫిర్యాదు చేశారన్నారు.దీంతో ఈసీ తాత్కాలికంగా వాలంటీర్లను సంక్షేమ పథకాలు ప్రజలకు అందించకుండా ఆదేశాలు ఇచ్చిందన్నారు.ఈ చర్యలతో తామంతా మనస్థాపానికి గురై రాజీనామాలు చేస్తున్నామని వాలంటీర్లు వాపోయారు. తెలుగుదేశం పార్టీ వారు తమ సేవలను గుర్తించకుండా వారిపై తప్పుడు ప్రచారాలు చేస్తూ బాధపడుతున్నారని వారు వాపోయారు.ప్రభుత్వమిచ్చే గౌరవ వేతనం కోసం కాకుండా ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించాలనే సేవా దృక్పథంతో తాము పని చేస్తున్నామని అన్నారు.ఎన్నికల కోడ్ పేరుతో తమను తమ విధులకు దూరం పెట్టడంతో తీవ్ర మనస్థాపానికి గురై రాజీనామా చేస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు.

# ప్రతి పంచాయతిల్లో పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటాం







- జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ జి.వరప్రసాద్

**కోట, ఏప్రిల్ 4 (శ్రీచక్ర):**

ప్రతి పంచాయతీలో గ్రామస్తులకు ఉపాధి కల్పించడానికి ఎన్ఆర్ఈజీఎస్ పనులు చేపట్టాలని జిల్లా ఏపీడి డాక్టర్ జి.వర ప్రసాద్ అన్నారు.ఈ సందర్భంగా గురువారం కోట మండలంలోని తిమ్మనాయుడుపాలెం, వెంకన్నపాలెం గ్రామపంచాయతీలో ఎన్ఆర్ఈజిఎస్ పనులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని జిల్లా ఏపీడి జీ. వరప్రసాద్ టీమ్ ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. అదేవిధంగా పలు పంచాయితీల్లో చేసినా పనులను మరలా అక్కడే చేస్తున్నట్లు ప్రత్యక్షంగా తెలిసిందన్నారు.అలా కాకుండా చేసిన చోట మరలా చేయకుండా మరొక ప్రాంతంలో వేరే పనులను ప్రారంభించాలని సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లకు పలు సూచనలు,సలహాలను అందజేయడం జరిగింది. ఒకవేళ ఉపాధి పనులపై లోపాలు తలెత్తితే సంబంధించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటానని జిల్లా ఏపీడి జీ.వరప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కంట్రోల్ ఆఫ్ క్వాలిటీ ఆఫీసర్ (జేక్యూసీఓ)ఎమ్.వి.రమణ,ఎస్ కే.ఖలీల్,తదితర ఎన్ ఆర్ జి ఈ ఎస్ బృందం,టెక్నీషియన్ లు చంద్రశేఖర్,స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ లు ఉన్నారు.

# పట్టణంలో 3,4,5 సచివాలయాలలో పెన్షన్ల పంపిణీని పరిశీలించిన తెలుగుదేశం పార్టీ బృందం





**గూడూరు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర):**

పెన్షనర్లు ఇబ్బంది పడకుండా పంపిణీలోని లోటుపాట్లను సరిదిద్దుకోవాలి.... టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్‌లిపెన్షన్లు సొమ్ము, ఆసరా మరియు చేయూత నిధులు బినామీ కాంట్రాక్టర్లు కు చెల్లించి లబ్దిదారులకు మొండి చేయి చూపి టీడీపీ పై ఫేక్ ప్రచారమా?.. లిమాజీ కౌన్సిలర్ తాతపూడి ఇశ్రాయేల్ కుమార్ నేడు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మరియు గూడూరు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్లు, టిడిపి నాయకులు కలిసి 3,4,5 సచివాలయాలు సందర్శించి పెన్షన్ల పంపిణీ లోటుపాట్లను పరిశీలించి అక్కడి సిబ్బందికి పెన్షనర్లు ఇబ్బంది పడకుండా సక్రమంగా సమయానికి పెన్షనర్లు పంపిణీ చేసే విధంగా తగు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం పార్టీ కార్యాలయంలో పెన్షన్ల పంపిణీ పై పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శీలం కిరణ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ మే 13 వ తేదీన జరగబోవు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గౌరవ వేతనం పొందుతున్న వాలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాల సొమ్మును ప్రజల వద్దకు వెళ్లి ఈ రెండు నెలలు పంపిణీ చేయకూడదని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నందున వాలంటీర్లు ఈ విధులలో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ మార్చి నెల 31 వ తేదీన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. కానీ ప్రభుత్వం ఈ విషయం పక్కదారి పట్టించి తెలుగుదేశం పార్టీ వాలంటీర్ల ద్వారా పెన్షన్లు ఇవ్వడాన్ని అడ్డుకుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారి సాక్షి పేపర్లో మార్చి 28వ తేదీన బడ్జెట్లో డబ్బు కేటాయింపు మార్చి నెల కనుక ఆలస్యం అవుతుంది అని పెన్షన్లు ఏప్రిల్ 3వ తేదీ పంపిణీ చేస్తామని రాశారని ,కానీ 31వ తేదీ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు వచ్చాక , ఆ విషయం పక్కదారి పట్టించి రాజకీయ లబ్ధి కోసం తెలుగుదేశం పార్టీ పెన్షన్లు పంపిణీ అడ్డుకుంటుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వైయస్సార్ ఆసరా మరియు వైఎస్ఆర్ చేయూత బటన్ నొక్కి నెల అయిందని నేటికీ లబ్ధిదారుల అకౌంట్లో డబ్బులు జమ కాలేదని పెన్షన్ల డబ్బు ఆసరా మరియు చేయూత డబ్బు వారి బినామీ కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించేసి డబ్బులు లేక మూడో తేదీ వరకు పెన్షన్లు పంపిణీ చేయలేని ఈ అసమర్ధ ప్రభుత్వం ఆ నెపాన్ని తెలుగుదేశం పార్టీ పై నెట్టి పబ్బం గడుపుకుంటుందని వారు విమర్శించారు. రోగులకు దివ్యాంగులకు ఇంటి వద్దకే పెన్షన్లు పంపిణీ చేస్తామని ఒకపక్క ఉత్తర్వులు ఇచ్చి ఇంకొకపక్క వారి నాయకులు కార్యకర్తలు చేత దివ్యాంగులను వృద్ధులను మంచాలపై వేసికొని సచివాలయాలకు మోసుకొని పోయి తెలుగుదేశం పార్టీపై సోషల్ మీడియాలో, వారి సొంత మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని వీటన్నిటిని ప్రజలు, పెన్షనర్లు గమనించాలన్నారు. సచివాలయం సిబ్బంది పెన్షన్లు పంపిణీ చేయాలని దివ్యాంగులకు, మంచంలో ఉన్న రోగులకు మరియు వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ప్రతి సచివాలయంలో ఉన్న కార్యదర్శులు అందరికీ లాగిన్ ఇచ్చి ప్రతి సచివాలయానికి సెర్ఫ్ ద్వారా ఖజానా నుండి డబ్బు జమ చేయడం జరిగిందని , ఆ డబ్బులు డ్రా చేసి లాగిన్ ఇచ్చిన సెక్రటరీలందరూ వచ్చిన పెన్షన్ దారులందరూ ఇబ్బంది పడకుండా పంపిణీ చేయాలని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. కానీ కొన్ని సచివాలయాలలో అడ్మిన్ ఒక్కరే డబ్బంతా తన దగ్గరే పెట్టుకుని ఆయనే పెన్షన్లు పంపిణీ చేయడంతో పెన్షన్ ఇవ్వడం ఆలస్యం అవుతుందని ఇళ్ల వద్ద ఇవ్వాల్సిన దివ్యాంగులకు రోగులకు పెన్షన్లు ఆలస్యంగా అందడం మా దృష్టికి వచ్చిందని అందుకని మేము సచివాలయాలకు వెళ్లి ఈ విషయాలను సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి ప్రశ్నించామని, ఇకమీదట సెక్రటరీలు అందరూ ఈ పెన్షన్లు పంపిణీ చేసి పెన్షన్లు ఇబ్బంది పడకుండా చేయాలని కోరామని, అలా చేయని పక్షంలో ఎలక్షన్ కమిషన్ కి, ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని , వాలంటీర్లు ఈ ప్రక్రియలో పాల్గొంటే ఖచ్చితంగా ఫిర్యాదు చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం కిరణ్ కుమార్, మాజీ కౌన్సిలర్లు తాతపూడి ఇశ్రాయేల్ కుమార్ కస్తూరి గురవయ్య, గూడూరు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎం.డి.అబ్దుల్ రహీం, తెలుగు యువత నాయకులు వేముల సునీల్, అల్లం వెంకట సాయి, అరవ పార్వతయ్య, టి.ఎన్.ఎస్.ఎఫ్ నాయకులు అసనాపురం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ స్మశాన వాటికకు గ్యాలరీ వితరణ



**కోట, ఏప్రిల్ 4 (శ్రీచక్ర):**

శ్రీ ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి.కిషోర్ తండ్రి పసుపులేటి.మనోహర్ గారి 14 వ వర్ధంతి సందర్భంగా పసుపులేటి చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి ఈ ట్రస్ట్ ద్వారా కోట లో నిర్మాణంలో వున్న హిందూ స్మశాన వాటిక స్వర్గధామం లో దహన కార్యక్రమం వీక్షించేందుకు వచ్చిన వారు ఎండకు వానకు ఇబ్బంది పడకుండా కూర్చొని వీక్షించేందుకు అనువుగా రెండు లక్షల రూపాయలు పైగా ఖర్చు చేసి నిర్మించి స్వర్గధామం కమిటీ వారికి పసుపులేటి చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ పసుపులేటి సంపూర్ణమ్మ చేతులమీదుగా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ మాట్లాడుతూ భవిష్యత్ లో పసుపులేటి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలియజేశారు.అదేవిదంగా స్వర్గధామం అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ జమ్మి ప్రసాద్ మాట్లాడుతూ కోటలో స్మశాన వాటికలో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా కర్మ క్రతువులతో సైతం అన్ని కార్యక్రమాలు చేసుకొనే విధంగా దాతల సహాయం తో అభివృద్ధి చేస్తున్నామని అందుకు సహక రిస్తూ పసుపులేటి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ వారి నాన్నగారి జ్ఞాపకర్థం గ్యాలరీ నిర్మించి ఇవ్వడం అభినందనీయమని ఇంకా దాతలు సహకరిస్తే కోట చుట్టు ప్రక్కల ఎక్కడా లేనివిధంగా స్వర్గధామంను సుందరంగా తీర్చిదిద్దుతామని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో స్వర్గధామం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం బాటిళ్లు పట్టివేత

**కోట, ఏప్రిల్ 4 (శ్రీచక్ర):**



కోట మండలంలోని కోట క్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా తీసుకెళ్తున్న 12 మద్యం బాటిళ్లు ను స్వాధీనం చేసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా గురువారం కోట మండలం కోట క్రాస్ రోడ్డు నందు దాసరి.సుకుమార్, ఇంగిలాల.కోటయ్య అను ఇద్దరూ స్కూటీ లో అక్రమంగా 12 ఓల్డ్ అడ్మినరల్ బాటిల్లను తీసుకెళుతుండగా కోట ఎస్.ఐ పి.నాగబాబు ఆధ్వర్యంలో చాకచక్యంగా వారిని పట్టుకుని అరెస్టు చేశారు.అనంతరం స్కూటీని కూడా స్వాధీనం చేసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది కార్తీక్ ఉన్నారు.

# గూడూరు మండలం పగడాలపల్లి వైసీపీ నుండి 30 కుటుంబాలు టీడీపిలో చేరిక



**గూడూరు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర):**

గూడూరు రూరల్ మండలం పగడాలపల్లి గ్రామం వైసీపీ నుండి నంబూరు శ్రీహరి నాయుడు ఆధ్వర్యంలో 30 కుటుంబాల వైసీపీ వారిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పాశిం సునీల్ కుమార్ మాజీ శాసన సభ్యులు %డ% నియోజకవర్గ అభ్యర్థి స్థానిక నాయకులు ఆధ్వర్యంలో కలిచేటి కృష్ణా రెడ్డి,వార్డు మెంబర్ వెంకటరత్నమ్మ,బొడుగు శ్రీనివాసులు,మద్దాలి వెంకటేశ్వర్లు తదితరులను కండువా కప్పి ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొండూరు వెంకటేశ్వర్లు రాజు,నంబూరు వెంకటేశ్వర్లు నాయుడు,పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు,జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, బొమ్మిరెడ్డి పెంచల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ పాలనలో.. రాష్ట్ర ప్రజలు విసిగిపోయారు!













- జగన్ పాలనలో సంక్షేమం కాదు సంక్షోభమే
- పార్టీ జెండాలు వేరైనా ఆజెండా ఒక్కటే.
- రాష్ట్ర ప్రయోజనాల కోసమే మాకలయిక.
- పింఛన్లు పంపిణీపై జగన్ ది శవరాజకీయం.
- రాష్ట్రంలో మద్యనిషేధం ఎక్కడ?
- రామచంద్రపురం ప్రజాగళం సభలో చంద్రబాబు

**రామచంద్రాపురం, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల పాలనలో ప్రజలు విసిగిపోయారని మే 13కోసం ప్రజలంతా ఆత్రంగా ఎదురుచూస్తున్నారని తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు అన్నారు. ఈమేరకు రామచంద్రపురం నియోజకవర్గ ద్రాక్షారామంలో ప్రజాగళం సభకు విచ్చేసిన చంద్రబాబుకు పసలపూడి బైపాస్ వద్ద నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రధాన రహదారిమీదుగా ద్రాక్షారామం చేరుకుని బోసుబొమ్మ సెంటర్ లో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కరెంటు చార్జీలు విపరీతంగా పెంచారని, నాణ్యమైన విద్యుత్ లేదని, ప్రశాంతంగా ఉండే కోనసీమలో అల్లర్లు సృష్టించారని, నేరస్తులకు జగన్ కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కరువుజిల్లా అనంత పురం జిల్లాకు కియాకారు తీసుకొచ్చామని, పారిశ్రామికవేత్తల ద్వారా వివిధ కంపెనీలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పించామని గుర్తు చేశారు.అయితే వైకాపా ప్రభుత్వంలో యువత గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు బానిసలుగా మారుతున్నారనిఈసందర్భంగా ఆరోపించారు.విశాఖపట్టణానికి మాదకద్రవ్యాలతో కూడిన కంటైనర్స్ పెద్దమొత్తంలో రావడం ఆందోళన కల్గించే అంశమని అన్నారు.మరోసారి జగన్ అధికారంలోకొస్తే రాష్ట్రం అధోగతిపాలవుతుందన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతుందని దీన్ని అంతమొందించే సమయంకోసం రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. టీడీపీ కార్యకర్త లను, నాయకులను జైలుపాలుచేసి ఇబ్బందులకు గురిచేసారని అలాగే వారి ఆస్తులను సైతం ధ్వంసంచేస్తూ భయానక వాతావరణం సృష్టించారని ఈసందర్భంగా ఆరోపించారు.పింఛన్లు పంపిణీ చేయలేని అసమర్ధ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అని దుయ్యబట్టారు. 'మే 13ఎప్పుడొస్తుందా? వైసీపీని బంగాళాఖాతంలోకి ఎప్పుడు కలుపుదామా అని ప్రజలు ఎదురు చూస్తున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు వేరైనా అజెండా ఒక్కటే. మా కలయిక రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని చంద్రబాబు ఉద్ఘాటించారు.జగన్ గత ఎన్నికల్లో బాబాయిని చంపి, కోడికత్తి డ్రామాతో లబ్ది పొందాడని. ఈ ఎన్నికల్లో పింఛన్లపై శవ రాజకీయాలు చేసి లబ్ధి పొందాలనుకుంటున్నాడని చంద్రబాబు ఆరోపించారు. ఎన్నికల ముందు కరెంట్ చార్జీలు పెంచనని చెప్పి అధికారంలోకి వచ్చాక ఆసార్లు పెంచారని.,చెత్త పన్ను, వృత్తి పన్నులు వేశారన్నారు. నిత్యవసర ధరలు, ఆర్టీసీ, పెట్రోల్ ధరలన్నీ పెంచారు. రూ.10 ఇచ్చి రూ.100 దోచేశాదని ధ్వజమెత్తారు. పరిపాలన చేతకాని జగన్, పేదలను నిరుపేదలు చేశాడని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట పింఛన్లు ఇవ్వటం చేతకాని దద్దమ్మ శవ రాజకీయం చేస్తున్నాడంటూ జగన్ వైఖరిపై విరుచుకుపడ్డారు. కోనసీమలో గతంలో ఎప్పుడైనా అల్లర్లు దాడులు జరిగాయా? నేడు పులివెందులకంటే దారుణంగా తయారైందని అన్నారు. దీనికి కారణం సైకో జగనేనని చంద్రబాబు దుయ్యబట్టారు. 'మద్య నిషేధం చేయకపోతే ఓటడగనన్నాడు. ఇప్పుడు ఓటెందుకు అడుతున్నాడు? మద్యం తయారీ, అమ్మకం అంతా జగన్దే. మధ్యం షాపుల్లో డిజిటల్ పేమెంట్స్ ఎందుకు లేవు? అని ప్రశ్నించారు. దళితులకు శిరోముండనం చేసిన వ్యక్తి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మరో ఎమ్మెల్సీ దళిత డ్రైవర్ చంపి డోర్ డెలివరి చేశాడు. ఇలాంటి వాళ్లను జగన్ పక్కన పెట్టుకుని ఊరేగుతున్నాడని ధ్వజ మెత్తారు. ఎస్సీలకు న్యాయం చేసిన పార్టీ టీడీపీ అంటూ, బాలయోగిని లోక్సభ స్పీకర్ చేసింది తమ పార్టీయేనని, ఇది మా బ్రాండ్ అన్నారు. జగన్ బ్రాండ్ బూమ్ బామ్ అని ఎద్దేవా చేశారు. రాజకీయాలంటే నోరు పారేసుకోవడమో, శవరాజకీయాలో కాదంటూ, అలాంటి రాజకీయాలు చేసేవారికి తగిన విధంగా గుణపాఠం చెబుతానన్నారు. బాబాయిని ఎవరు చంపారో నీ చెల్లికి సమాధానం చెప్పాలని చంద్రబాబు నిలదీశారు. ఫ్యాన్ అరిగిపోయి తిరగడం మానేసిందంటూ, వైసీపీ ఎన్నికల గుర్తు ఫ్యానికి బదులు గొడ్డలి గుర్తు పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. గొడ్డలి రాజకీయాలు సహిస్తారా? అని ప్రజలను ప్రశ్నించారు. తాను సీఎంగా ఉన్నపుడు 100కి పైగా సంక్షేమ పథకాలు అమలు చేశామని, అన్న క్యాంటీన్, చంద్రన్న భీమా, పెళ్లికానుక, రంజాన్, క్రిస్మస్ కానుకలు, విదేశీ విద్య, బెస్ట్ అవైలబుల్ స్కూల్, కార్పొరేషన్ రుణాలు, ఆదరణ పనిముట్లు. ఈ పథకాలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. జగన్ నవరత్నాల పేరుతో నవ మోసాలకు పాల్పడ్డాడని విమర్శలు గుప్పించారు. ఒక్క టీచర్ పోస్టయినా భర్తీ చేశావా?అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇక్కడ మంత్రి చెల్లుబోయిన వేణు చెల్లని కాసులా మారాడనీ. దోపిడితో నియోజకవర్గాన్ని కొల్లగొట్టాడని విమర్శించారు. వైవీ సుబ్బారెడ్డి దగ్గర మోకాళ్లు మీద కూర్చుని బీసీల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాడని గుర్తు చేశారు.అయితే అలాంటి వ్యక్తి కావాలా? ఆత్మగౌవరంతో బ్రతికే ఎన్డీయే అభ్యర్థి సుభాష్ కావాలా? అని ప్రజలను అడిగారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే కోటిపల్లి, కుమ్మర సావరం, కూళ్ల గ్రామాల్లో గోదావరి కరకట్ట మరమ్మతు చేస్తామని , రామచంద్రాపురం, గంగవరం మండలాల్లో డ్రైనేజీ సౌకర్యం కల్పిస్తాం. రోడ్లకు మహర్షక తీసుకొస్తామని కాల్వ ఆధునీకరణ చేస్తాం. టిడ్కో ఇళు లబ్దిదారులకే అప్పగిస్తాం. కోటిపల్లి, సర్పాపురం రైల్వే లైన్ బాలయోగి కల. దీన్ని పూర్తి చేసే బాధ్యత మాదేనని స్పష్టం చేశారు. కానీ టీడీపీ వస్తే అవి నిలిచిపోతాయని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు తెచ్చి అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసి రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని, ప్రజలు ఎన్డీయే కూటమిని భారీ మెజార్టీతో గెలిపించాలని చంద్రబాబు నాయడు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అమలాపురం ఎంపి అభ్యర్ధి గంటి హరీష్ మాధుర్, జనసేన పార్టీ ఇన్చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు పప్పుల మసేనువెంకన్న (రేవుశ్రీను), రాయపురెడ్డి రాజా,టీడీపీ సీనియర్ నేత చంద్రు వీర్రాజుచౌదరి, కాజులూరు మండల జనసేన యువత అధ్యక్షులు కూనపరెడ్డి శివకృష్ణ, టీడీపీ నాయకులు తోట కృష్ణ , గుబ్బల ఏసురాజు, గండికిశోర్ ,నియోజకవర్గ స్థాయిలో అధికసంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిడ్డే మీల్స్ నిర్వహణ అక్రమంగా చేపట్టాలి

- కోట మండల విద్యాశాఖ అధికారి దారా.మస్తానయ్య



**కోట, ఏప్రిల్ 4 (శ్రీచక్ర):**

విద్యార్థులకు అందించే మిడ్ డే మిల్స్ నిర్వహణ సక్రమంగా చేపట్టాలని కోట మండల విద్యాశాఖ అధికారి ధారా మస్తానయ్య అన్నారు.ఈ సందర్భంగా గురువారం కోట మండలంలోని కొత్తపాలెం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలను క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి తదనంతరం మిడ్ డే మిల్స్ నిర్వహణ సక్రమంగా అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. అదేవిధంగా పిల్లల యొక్క అభ్యసన శక్తి సామర్థ్యాలును ఆరా తీశారు.ఉపాధ్యాయులు సిలబస్ ఎంత మాత్రం పూర్తి చేశారా అనేది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్ని సక్రమంగా ఉండడంతో స్థానిక ప్రధానోపాధ్యాయురాలు పద్మావతిని అభినందించారు.అనంతరం కొత్తపాలెంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో జరుగుతున్నటువంటి నాడు నేడు పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కోటయ్య ఉన్నారు.

## నాయుడుపేట సిద్ధం సభకు బయలుదేరిన వైసీపీ నాయకులు



**కోట, ఏప్రిల్ 4 (శ్రీచక్ర):**

కోట మండలం గూడలి పంచాయతీ నుండి నాయుడుపేటలో జరుగుతున్న మేమంతా సిద్ధం సభకు బస్సులో వైసిపి సీనియర్ నాయకులు వేమారెడ్డి.షనీల్ రెడ్డి,గూడలి ఉపసర్పంచ్ పల్లెమల్లు. విజయ సారధి రెడ్డి ఆధ్వర్యంలో బయలుదేరారు. అదేవిధంగా పల్లె మల్లు విజయ సారధి రెడ్డి ఆధ్వర్యంలో బయలుదేరిన వైసీపీ అభిమానులకు ఎండ తీవ్రతకు ఇబ్బందులు కలగకుండా నీటి సదుపాయాలు కల్పించడం జరిగింది.

## సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికిన వైసీపీ శ్రేణులు

- భారీ గజ మాలతో స్వాగతం
- మీని జాతర తలపించిన గూడూరు.. పోటు పాలెం కూడలి



**గూడూరు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర):**

నాయుడు పేట సిద్దం సభలో బాగంగా నెల్లూరుకి వెళ్తున్న సిఎం జగన్ మోహన్ రెడ్డికి గూడూరు - పోటు పాలెం కూడలి వద్ద గూడూరు వైసీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. భారీ పండ్లతో తయారుచేసిన గజమాల మధ్య సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు వైసిపి నాయకులకు కార్యకర్తలకు అభివాదం చేశారు. పోటుపాలెం కూడలికి సి.ఎం జగన్ రాక తో భారీగా ప్రజలు,అభిమానులు తరలివచ్చారు.పోటుపాలెం కూడలి మీనీ జాతరను తలపించింది. ఆయన వెంట గూడూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ మేరిగా మురళీధర్ ఎంపీ గురుమూర్తి ఇతర నాయకులు ఉన్నారు.

# రామచంద్రపురం అభ్యర్థి సుభాష్ సమక్షంలో అయితపూడి సర్పంచ్ టీడీపీలో చేరిక









- **ఉండూరులో మాజీ సర్పంచ్‌తో పాటు పలువురు చేరిక**

**రామచంద్రపురం, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

రామచంద్రపురం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో కాజులూరు మండలం అయితపూడి గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి చందర్రావు తోపాటు ఆయన అనుచరులు పలువురు చేరారు. వీరందరికీ సుభాష్ టీడీపీ కండువాలు మెడలో వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అలాగే రామచంద్రపురం మండలానికి చెందిన ఉండూరు గ్రామ సర్పంచ్ సాయి ఆద్వర్యంలో ఇక్కడ మాజీ సర్పంచ్ తోపాటు పలువురు సుభాష్ సమక్షంలో చేరారు వీరికి సుభాష్ పార్టీ కండరాలు మెడలో వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా సుభాష్ మాట్లాడుతూ మీరంతా రానున్న ఎన్నికల్లో ఐకమత్యంగా పనిచేసి తన గెలుపుకు కృషిచేయాలని కోరారు. దీంతో సుభాష్ కు ఈసందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన వారంతా చేయిచేయి కలిపి సంఘీభావం తెలిపారు. అనంతరం వారందరిని పేరుపేరునా పరిచయం చేసుకున్నారు.

## వైసీపీ అభ్యర్థి సమక్షంలో తిప్పరాజుపాలెంలో పలువురు వైఎస్సార్సీపీలోనికి చేరిక !



**కాజులూరు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

కాజులూరు మండలం తిప్పరాజుపాలెంలో గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ సమక్షంలో నగరులు(ఉప్పర్లు) సమాజికవర్గ నాయకులు జక్కే పెద్దులు. దండు సుబ్బారావు, శ్రీను, జక్కే పెద్దఅప్పన్న, దండు వెంకన్న తదితర నాయకుల ఆద్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు తెలుగుదేశం, జనపేన పార్టీలకు చెందిన కార్యకర్తలు వైఎస్సార్సీపీలోనికి చేరారు. పార్టీలోనికి చేరిన వారికి పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్ పార్టీ కండువాలు మెడలో వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో సీఎం జగనన్న పాలన ఒక సువర్ణఅధ్యాయంగా నిలిచిపోతుందన్నారు. నవరాత్నల పథకం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్శితులై జనసేన, తెలుగుదేశంపార్టీల నుంచి పలువురు వైఎస్సార్సీపీలోనికి చేరుతున్నారన్నారు. అనంతరం పార్టీలోనికి చేరిన కార్యకర్తలు మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనతో రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని రానున్న ఎన్నికలలో పార్టీ మరోసారి విజయం సాదించి అధికారంలోనికి వచ్చేలా తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాయుడు లీలాశంకర్, స్థానిక మాజీ సర్పంచ్ యాళ్ల శ్రీనివాస్. ఆర్ఎంసీ డైరెక్టర్ నల్లమిల్లి ఈశ్వర్రెడ్డి. గొల్లపాలెం, తణుకువాడ పిఏసిఎస్ చైర్మన్లు సత్తి శ్రీరామారెడ్డి. పితాని సుబ్రహ్మణ్యం. మాదిరెడ్డి పుద్వీ, వుగరాల శివ తదితరులు పాల్గొన్నారు.

## చల్లా రాజగోపాల్ సైన్యాన్ని టిడిపిలోకి ఆహ్వానం

- **టిడిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు**
- **రానున్న ఎన్నికలలో సైకిల్ గుర్తుకు ఓట్లేయండి**
- **చల్లా రాజగోపాల్ యాదవ్**

**ప్రొద్దుటూరు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**





రానున్న ఎన్నికలలో ప్రజలందరు సైకిల్ గుర్తుకు ఓట్లేయండని రాష్ట్ర బిసి నాయకులు, కృష్ణాలయ ఛైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్ అన్నారు. గురువారం ఆయన ప్రొద్దుటూరు శాసనసభ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి, కడప పార్లమెంట్ అభ్యర్థి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి సమక్షంలో చల్లా రాజగోపాల్ యాదవ్ ఆయన వర్గీయులతో, దేవాంగ కళ్యాణ మండపం అధ్యక్షుడు సుబ్రమణ్యం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనకు వారు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముందుగా నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ చిరకాల మిత్రుడు మాట తప్పని వాడు ఎన్నో ప్రజాసేవ కార్యక్రమాలు చేపట్టి ప్రజాభిమానం పొందిన మా చల్లా రాజగోపాల్ తనకు మద్దతులిస్తూ తెలుగుదేశం పార్టీకి చేరడం సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబు ప్రొద్దుటూరు కు వస్తున్న నేపథ్యంలో ఆయన చేతుల మీదిగా పార్టీ కండువా కప్పుకోవాలని సూచించినా లేదని తన సమక్షంలోనే పార్టీ కండువా కప్పుకోవాలని ఉందని చెప్పడం చల్లాకు తన మీదున్న అభిమానానికి నిదర్శనం అన్నారు. చల్ల రాజగోపాల్ రాకతో ప్రొద్దుటూరు నియోజకవర్గం లో టిడిపి బలోపేతమైందని చెప్పుకొచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాడని కొనియాడారు. బీసీలలో మంచి ఉన్న నాయకుడిగా ఎదిగిన చల్లా రాజగోపాల్ కు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపడితే సూపర్ సిక్స్ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు అభివృద్ధి వైఫల్యాలు అరాచక పాలన కు వ్యతిరేకంగా ప్రజలు తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా చల్లా రాజగోపాల్ మాట్లాడుతూ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజుల రెడ్డి శాంతియుతంగా మంచి పాలన అందిస్తారని, కావున ప్రజలు సైకిల్ గుర్తుకు ఓటు వేసి వేయించి ఎమ్మెల్యేగా నంద్యాల వరదరాజులు రెడ్డిని ఎంపీగా భూపేష్ రెడ్డిని మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంపీ భూపేష్ రెడ్డి మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వైయస్ వివేక హత్య కేసులో నిందితుడుగా ఉన్న వైయస్ అవినాష్ రెడ్డి ఒకపక్కనీతికి నిజాయితీగా వుంటూ కొత్తగా రాజకీయాలలో ప్రవేశించిన తాను కడప ఎంపీగా పోటీ చేస్తున్నామని అన్నారు. ప్రజలు గమనించి సైకిల్ గుర్తు వేసి ఎమ్మెల్యేగా వరదరాకుల వెళ్లి ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, బిజెపి కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు, జనసేన నాయకులు జిలానీ బాష, సుంకర మురళి, కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, మాజీ జెడ్పిటిసి భాస్కర్, కౌన్సిలర్లు మురళీధర్ రెడ్డి, మునీర్, వైయస్ మహమ్మద్ గౌస్, టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ప్రొద్దుటూరు కు విచ్చేసిన నారా భువనేశ్వరి



**ప్రొద్దుటూరు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రొద్దుటూరు కు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి విచ్చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రొద్దుటూరు శాసనసభ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో కడప పార్లమెంట్ అభ్యర్థి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి తో కలిసి ఆమె మండలంలోని పెద్దశెట్టిపల్లి గ్రామంలో చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందిన పార్టీ కార్యకర్త కూరపాటి రాధ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ప్రొద్దుటూరు లో మృతి చెందిన బిసి నాయకులు నందం సబ్బయ్య తల్లితన కొడుకుని వైసీపీ వాళ్ళు అన్యాయంగా చంపిన విధానం, ఆ తరువాత ప్రొద్దుటూరు టిడిపి ఇంఛార్జి డాక్టర్ జి.వి.ప్రవీణ్ కుమార్ రెడ్డి తమ కుటుంబానికి అన్ని విధాల ఆదుకున్నారు అని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు టిడిపి ఇంఛార్జి జి.వి.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ.మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి విజయ భాస్కర్ రెడ్డి, ప్రొద్దుటూరు రూలర్ మండల కన్వీనర్ బాబుల్ రెడ్డి, పెద్ద శెట్టిపల్లె సర్పంచ్ మధుసూదన్, రాజుపాలెం మండల కన్వీనర్ ధనిరెడ్డి విశ్వనాథరెడ్డి, మాజీ రాజుపాలెం సర్పంచ్ సాన వెంకటసుబ్బారెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, జయరాం రెడ్డి, కొర్రపాడు సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, శివ నాగిరెడ్డి, వెంగలాయపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, మాజీ సర్పంచ్ కూలూరు శ్రీనివాసుల రెడ్డి, పర్లపాడు సౌరెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, వెలవలి పద్మనాథ రెడ్డి, నవీన్ రెడ్డి, జాకీర్, టంగుటూరు గుత్తి దస్తగిరి, గాదె గూడూరు రవికాంత్ రెడ్డి, సురేష్ నాయుడు, పగిడాల రాంభూపాల్ రెడ్డి,మహేష్,కొట్టాల జగన్, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు జబివుల్లా, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి, మాజీ మున్సిపల్ చైర్మన్ పాణ్యం సావిత్రమ్మ, మాజీ కౌన్సిలర్ పాణ్యం సుబ్బరాయుడు, 40 వార్డ్ పల్లా లక్ష్మీదేవి, 28 వార్డ్ లక్ష్మీదేవి, అమ్మని, 31 మెరువా నీలిమ, 41 వార్డ్ శూలంగా లక్ష్మీదేవి, నంద%శీ% అపరాధిత, నందం లక్ష్మీదేవి, బెజవాడ అమ్మని, కిరణ్, శూలం ప్రసాద్, మాజీ కౌన్సిలర్ రామ సంజీవరెడ్డి, 37 వార్డ్ గంగాధర్, కొత్తపేట కృష్ణారెడ్డి,34 వార్డ్ రాఘవ, 8 వార్డ్ శ్రీనివాసులు, 9వ వార్డు కరిముల్లా, నంగునూరు పల్లె టీగురప్ప, రామకృష్ణ, కల్లూరు నరసింహులు, చెన్నంరాజుపల్లె నశ్యం వెంకటసుబ్బయ్య, నాగయ్య పల్లె పెంచల్ రెడ్డి, బాలకృష్ణ, సీతం పల్లె సర్పంచ్ చంద్రమోహన్, బంక చిన్నయపల్లె రామ్మోహన్ రెడ్డి, దొరసానపల్లి ఇంజేటి నాగయ్య, పెన్నా నగర్ మజీద్, ప్రొద్దుటూరు రూరల్ మండలం ఉపాధ్యక్షుడు షరీఫ్ కవి, ఈశ్వర్ రెడ్డి నగర్ బాలు, గోపవరం గగ్గుటూరి గౌస్ మొహిద్దిన్, భగత్ సింగ్ కాలనీ పట్నం మా భాష, ద్వారకా నగర్ కిట్టు,అంగడి శ్రీనివాసులురెడ్డి, ఆచార్య కాలనీ మార్తల ప్రతాపరెడ్డి, టిఎన్టీయుసి ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు తమ్మిశెట్టి శ్రీనివాసులు, బీసీ సెల్ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు తమ్మిశెట్టి సురేంద్ర, అమృతా నగర్ ఆర్ఎంపీ ప్రసాద్, పల్లా అంజి బాబు,బాబా ఫక్రుద్దీన్,మరియు నాయకులు, కార్యకర్తలు నందమూరి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎంవిఆర్ 80 వ జయంతి సందర్భంగా నివాళులర్పించిన ఎంపీ, ఎమ్మెల్యే



**ప్రొద్దుటూరు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**

ఎంవి రమణారెడ్డి 80వ జయంతి సందర్భంగా నివాళులర్పించిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి. గురువారం ఆయన మాజీ ఎమ్మెల్యే ఎం. వి. రమణారెడ్డి 80వ జయంతి సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి ప్రొద్దుటూరు లోని ఆయన నివాసానికి విచ్చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎం. వి. రమణారెడ్డి కి వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అంటే విపరీతమైన అభిమానం అని, జగన్ గెలుపు కోసం, సీఎం అవ్వడం కోసం ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని వివరించారు. గతంలో ఆర్టీపీపీ, సర్వారాయసాగర్ ఏర్పాటుకు ఎంవిఆర్ సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఎంవిఆర్ ఎమ్మెల్యే గా వున్న సమయంలో ప్రొద్దుటూరు అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన స్పూర్తితో కొనసాగుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ ఛైర్మన్ మల్లెల ఝాన్సీ, మాజీ ఉప ఎంపిపి మల్లెల రాజారాం రెడ్డి, వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కల్లూరు నాగేంద్ర రెడ్డి, రాజుపాలెం మాజీ ఎంపిపి మెట్టుపల్లె ప్రభాకర్ రెడ్డి, ఎంవిఆర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఎంపీపీ శేఖర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం

**ప్రొద్దుటూరు, ఏప్రిల్ 4 (శ్రీచక్ర) :**



త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సోములవారి పల్లె పంచాయితీ పెన్నా నగర్ లోని 4 వ ఎంపీటీసీ మరియు 5 వ ఎంపీటీసీ పరిధిలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఎన్నికల ప్రచారం విశేష ఆదరణతో సాగింది. ప్రతి ఇంటి నుంచి ప్రజలు ఎమ్మెల్యే, ఆయన సతీమణి, కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి, తనయుడు రాచమల్లు రాఘవేంద్ర రెడ్డి, వైస్ ఛైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ని చిరునవ్వు తో ఆహ్వానించారు. తమకు లబ్ధి చేకూర్చిన ప్రభుత్వాన్ని తాము తిరిగి గెలిపించుకుంటామని ప్రజలు స్వయంగా తెలిపారు. మరొకమారు తనను ఎమ్మెల్యేగా, వైయస్ అవినాష్ రెడ్డిని పార్లమెంటు సభ్యుడుగాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ ఛైర్మన్ మల్లెల ఝాన్సీ, ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ ప్రశాంతి, ఉప సర్పంచ్ మార్తల కృష్ణ రెడ్డి, 4 వ ఎంపిటీసి మహబూబ్ బాషా, 5 వ ఎంపిటీసి సుభాష్ చంద్రబోస్, వైసీపీ అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మిదేవి, ఎంపిటీసి లు మహబూబ్ బాషా, సుభాష్ చంద్రబోస్, పెన్నా నగర్ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్న వెంకన్న నిత్య అన్నదానా ట్రస్ట్ కి 1,50,000 విరాళాలు



**ద్వారకాతిరుమల. ఏప్రిల్ 04 (శ్రీచక్ర) :**



చిన్న వెంకన్న నిత్య అన్నదాన ట్రస్ట్ కు గురువారం ఇద్దరు భక్తులు 1,50,000 విరాళాలు ఇచ్చారు ఏలూరు కి చెందిన నిమ్మల రాజు 1.00.116 ఇవ్వగా మరియు ఏలూరు. కలరాయి గూడెం గ్రామానికి చెందిన.యం. వెంకట సత్యనారాయణ 50.116 ఇచ్చారు ముందుగా వారి వారి కుటుంబ సభ్యులతో ఆలయానికి చేరుకున్న వారు స్వామి అమ్మవార్లను దర్శించుకుని అనంతరం వారి విరాళాలను ఆలయ కార్యాలయంలో జమచేశారు ఈ సందర్భంగా దాతలకు ఆలయ సుపరింటీండెంట్. రమణ రాజు విరాళాల బాండ్ పత్రాలని వారికి అందజేశారు.

## సిలువ ప్రతిష్ట కార్యక్రమంలో యువనేత బొండాడ వెంకన్నబాబు



**ద్వారకాతిరుమల. ఏప్రిల్ 04 (శ్రీచక్ర) :**

మండలం లోని గొల్లగూడెం గ్రామంలో ఆర్సీఎం చర్చ్ సిలువ ప్రతిష్ట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ద్వారకాతిరుమల మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువనేత బొండాడ వెంకన్నబాబు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంఘ సభ్యులు ప్రారంభించిన చర్చి నిర్మాణంలో ప్రధానమైన సిలువ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనటం ఎంతో ఆనందం కలిగించిందని తెలిపారు కార్యక్రమంలో పార్టీ ప్రెసిడెంట్ నిట్టా మురళి మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## మంచి చేసిన ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి



**ద్వారకాతిరుమల. ఏప్రిల్ 04 (శ్రీచక్ర) :**

ప్రజలకు సంక్షేమాన్ని చేరువ చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని రాష్ట్ర హెూంశాఖ మంత్రి తానేటి వనిత కుటుంబ సభ్యుడు కొండవీటి ఆశీర్వాదం అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన రామసింగవరంలో గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశీర్వాదం మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటవ తేదిన ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేసే వలంటీర్లను టీడీపీ నాయకులు కుట్రతో అడ్డుకున్నారని, దాని కారణంగా వృద్ధులు, వికలాంగులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల ముందు మోసపూరిత హామీలు ఇవ్వడం టీడీపీకి కొత్తేమి కాదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే జన్మభూమి కమిటీలు ప్రజల రక్తాన్ని పీల్చేస్తాయన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత జగనన్నకు దక్కిందన్నారు. మళ్లీ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను సీఎం చేసుకోవాలన్నారు. అలాగే గోపాలపురం ఎమ్మెల్యేగా తానేటి వనితను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, జేసీఎస్ కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ. గ్రామ సర్పంచ్ ఆకురాతి ధ్యానేశ్వరరావు, ఎంపీటీసీ మానికల లవరాజు, పెన్మత్స కొండరాజు, పెన్మత్స పండురాజు, ఉప్పల మునేశ్వరరావు, బిరుదుగడ్డ చల్లారావు, దాసరి ఏసురత్నం, గోపాలపురం నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ ఆచంట సురేష్, కనికెల్లి ఏసు బిరుదుగడ్డ సుఖాకరరావు.. మురోదరరెడ్డి, ముల్లంగి ఈశ్వరరెడ్డి వసంతాటి సుబ్బారావు తదితరులున్నారు.

# అసూయ పుట్టిస్తున్న అనసూయ ఫోటోలు



అనసూయ ఏమి చేసినా వైరల్ అవుతూ ఉంటుంది. ఏదైనా మాట్లాడినా లేక ఫోటో ఏదైనా పెట్టినా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ ఉంటాయి. ఇప్పుడు ఆమె తాజాగా తన ఫోటోలు అభిమానుల కోసం తన సామాజిక మాధ్యమంలో షేర్ చేశారు, అవి వైరల్ అవుతూ వున్నాయి. అనసూయ సామాజిక మాధ్యమాల్లో ఎటువంటి ఫోటో పెట్టినా వైరల్ అవుతూనే ఉంటుంది. అందులోకి కొంచెం అందంగా, గ్లామర్ గా వుండే ఫోటోలు పెడితే ఇంకా చెప్పనక్కరలేదు, అవి ఇంకా వైరల్ అవుతాయి. కొన్ని రోజుల క్రితం అనసూయ ఒక బ్యూటీ సలోన్ ప్రారంభోత్సవానికి వెళ్లారు. అక్కడ సలోన్ ఓపెన్ చేసినప్పుడు ఫోటోలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ తరువాత అనసూయ తన ఫోటోలు కూడా కొన్ని తన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అవి కూడా ఇప్పుడు బాగా వైరల్ అవుతున్నాయి. అలాగే ఈమధ్య ఒక యూట్యూబ్ ఛానెల్ కి ఇంటర్వ్యూ కూడా ఇచ్చిన అనసూయ తన సామాజిక మాధ్యమాల్లో ఎందుకు ఏడుస్తున్న వీడియోస్ పెట్టవలసి వచ్చిందో కూడా వివరణ ఇచ్చారు. అలాగే ఈమధ్యనే ఆమె నటించిన 'రజాకార్' సినిమా విడుదలై పాజిటివ్ రివ్యూస్ తెచ్చుకుంది. అందులో అనసూయ ఒక పాటలో కనిపించడమే కాకుండా, ఆ తరువాత వచ్చిన ఒక గొప్ప సన్నివేశంలో నటించి మెప్పించింది. ఈ సినిమాలో ఆమె పాత్ర నిడివి చాలా చిన్నదే అయినా అనసూయకి పేరు మాత్రం బాగా వచ్చింది. ఇప్పుడు 'పుష్ప 2' సినిమాలో కూడా అనసూయ కనబడబోతోంది. ఇందులో ఒక నెగటివ్ పాత్రలో అనసూయ కనపడుతుంది. 'పుష్ప' మొదటి భాగంలో అనసూయ పాత్ర కన్నా, రెండో పార్టులో ఇంకా ఎక్కువ ఉంటుంది అని అంటున్నారు. సుకుమార్ ఈ సినిమాకి దర్శకుడు, అల్లు అర్జున్ కథానాయకుడు. రష్మిక మందన్న కథానాయిక. ఆగస్టు 15న ఈ సినిమా విడుదలవుతోంది. ఏప్రిల్ 8న కథానాయకుడు అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుండి ఒక టీజర్ వస్తుంది అని ఈ చిత్ర నిర్వాహకులు ప్రకటించారు, ఈ సినిమా కోసం అర్జున్ అభిమానులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. మరి ఈ టీజర్ లో ఈ సినిమాలో వున్న మిగతా పాత్రలు అంటే అనసూయ, రావు రమేష్, ఫహద్ ఫాజిల్ లను కూడా చూపెడతారా, లేక ఒక్క అల్లు అర్జున్ నే చూపిస్తారా అనేది ఏప్రిల్ 8న తెలుస్తుంది.

## తల్లి కాబోతున్న బాలీవుడ్ నటి ఆర్తి చాబ్రియా

బాలీవుడ్ నటి ఆర్తి చాబ్రియా 41 ఏళ్ళ వయసులో తల్లి కాబోతుంది. తాను తల్లి కాబోతున్నట్లు బేబి బంప్స్ ఫోటోలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంది ఈ నటి. లజ్జ, ఆవారా పాగల్ దీవానా, షూటౌట్ ఎట్ లోఖండ్వాలా, మిలేంగే మిలేంగే, పార్ట్నర్ లాంటి సూపర్ హిట్ సినిమాల్లో నటించిన ఈ భామ ఒకరికి ఒకరు సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ఇంట్లో శ్రీమతి వీధిలో కుమారి, గోపి ? గోడమీద పిల్లి.. చింతకాయల రవి లాంటి పలు సినిమాలతో మెప్పించింది.అయితే 2019లో చా÷-టర్డ్÷డ్ అకౌంటెంట్ విశారద్ బీడస్సిని పెళ్లి చేసుకుని ఆస్ట్రేలియా వెళ్ళిపోయింది ఈ భామ. ప్రస్తుతం ఆస్ట్రేలియాలోనే నివసిస్తుంది. ఇదిలావుంటే తాజాగా తాను తల్లి కాబోతున్నట్లు ఫోటోలను పంచుకుంది. ఇక లేట్ వయసులో ఆర్తి తల్లి కావడంతో ఆమె అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940**, e-mail: **sreechakratelugu@gmail.com.**